






# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 11 సంచిక : 192 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు బుధవారం 19 మార్చి 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 192 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE WED 19 MARCH 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## ఎమ్మెల్యేల గ్రూప్ ఫొటోలను పంచుకున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

- ఏపీ అసెంబ్లీలో ఫొటో షూట్
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కూడా హాజరయ్యారన్న రఘురామకృష్ణరాజు
- నెట్టింట ఫొటోల సందడి



**పెన్ పవర్ డెస్క్:**అసెంబ్లీలో ఎమ్మెల్యేలందరూ గ్రూప్ ఫొటో దిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఈ ఫొటోల్లో ఉన్నారు. ఈ ఫొటో షూట్ పై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందించారు. అసెంబ్లీ ఆవరణలో ఈరోజు ఎమ్మెల్యేలు అందరూ గ్రూప్ ఫొటో తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. ఇది ప్రజాస్వామ్య ప్రయాణానికి గుర్తుగా, రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అభివర్ణించారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ప్రత్యేక ఫొటో సెషన్ లో పాల్గొన్నారని రఘురామకృష్ణరాజు వివరించారు. ఈ ఫొటోలో ప్రతిబింబించిన ఐక్యత, బాధ్యత, ప్రజలకు అందించే సేవల పట్ల నిబద్ధత మన ప్రజాస్వామ్య వ్యవస్థ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యేల గ్రూప్ ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. అటు, ఎమ్మెల్సీలతోనూ చంద్రబాబు, పవన్, లోకేశ్ గ్రూప్ ఫొటో దిగారు. ఈ ఫొటోలో మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కూడా ఉన్నారు.

## విజయవాడలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీలు ప్రారంభం

- ఇందిరాగాంధీ స్టేడియంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు
- క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి 13 అంశాల్లో మూడు రోజుల పాటు పోటీలు
- బహుమతి ప్రదానం చేయనున్న సీఎం చంద్రబాబు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో మూడు రోజుల పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ ఆటల పోటీలు జరగనున్నాయి. ఈ మధ్యాహ్నం ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు అనిత, నాదెండ్ల మనోహర్ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొని ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర క్రీడల మంత్రి మండిపల్లి

వివరాలు 2లో..

## తక్కువ ద్రవ్యోల్బణం నమోదవుతున్న రాష్ట్రాలలో నాలుగో స్థానంలో ఏపీ

- మార్కెట్ ధరల పర్యవేక్షణపై మంత్రుల కమిటీ సమావేశం
- హాజరైన నాదెండ్ల, అచ్చెన్నాయుడు, పయ్యావుల, సత్యకుమార్
- అధికారులకు దిశానిర్దేశం



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ సచివాలయంలో మార్కెట్ ధరల పర్యవేక్షణపై మంత్రుల బృందం సమావేశమైంది. ఈ సమావేశానికి రాష్ట్ర ఆహారం, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు

వివరాలు 2లో..

## ఈ నెలాఖరు నాటికి వాట్సాప్ ఈ-గవర్నెన్స్ లో

# 300 రకాల సేవలు

- గతంలో చంద్రబాబు పౌరసేవలను ఈ-సేవగా మార్చారన్న లోకేశ్
- యువగళం పాదయాత్రతో ప్రజాసమస్యలు పూర్తిగా అర్థం చేసుకున్నానని వెల్లడి
- అందుకే వాట్సాప్ ఈ-గవర్నెన్స్ తీసుకువచ్చామని వివరణ





**పెన్ పవర్ డెస్క్:**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకువచ్చిన వాట్సాప్ ఈ-గవర్నెన్స్ విధానంపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. వాట్సాప్ ఈ-గవర్నెన్స్ ద్వారా 200 రకాల పౌరసేవలు అందించగలుగుతున్నామని, సర్టిఫికెట్ల జారీ ఎంతో సులభంగా మారిందని తెలిపారు. మార్చి నెలాఖరు నాటికి 300 పౌరసేవలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. గతంలో చంద్రబాబు పౌరసేవలను ఈ-సేవగా మార్చి ప్రజలకు వద్దకు పాలన తీసుకువెళ్లారని తెలిపారు. తాను గతేడాది నిర్వహించిన యువగళం పాదయాత్ర ద్వారా, రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకున్నానని వెల్లడించారు. ప్రభుత్వం నుంచి సేవలు అందుకోవాలంటే గతంలో ప్రజలు చేతులు కట్టుకుని నిల్చోవాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు. ఈ పద్ధతి కాకుండా, సులభతరంగా పౌరసేవలు అందించాలని నిర్ణయించామని... అందులో భాగంగా వాట్సాప్ ఈ-గవర్నెన్స్ తీసుకువచ్చామని మంత్రి నారా లోకేశ్ వివరించారు.

## వేల మైళ్ల దూరంలో ఉన్నప్పటికీ.. మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు..

- అంతరిక్షం నుండి తిరిగివస్తున్న సునీతా విలియమ్స్‌కు ప్రధాని మోదీ లేఖ
- అంతరిక్షంలో తొమ్మిది నెలలు గడిపిన సునీతా విలియమ్స్
- ఎట్టకేలకు భూమికి తిరిగివస్తున్న వైనం
- భారత ప్రజల హృదయాలలో సునీతా విలియమ్స్ స్థానం ప్రత్యేకమన్న మోదీ
- ఆమె ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు లేఖలో వెల్లడి

వివరాలు 2లో..



## అప్పుడు జగన్ చేసిన తప్పే ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నారు

- ఇటీవల వైఎస్సార్ జిల్లా పేరును తిరిగి వైఎస్సార్ కడప జిల్లాగా మార్పు
- తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరు తొలగింపు
- తీవ్రస్థాయిలో స్పందించిన షర్మిల



**పెన్ పవర్ డెస్క్:**ఇటీవల ఏపీలోని కూటమి ప్రభుత్వం వైఎస్సార్ జిల్లా పేరును తిరిగి వైఎస్సార్ కడప జిల్లాగా మార్చడం, కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరును తొలగించడం తెలిసిందే. దీనిపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో స్పందించారు. సీఎం చంద్రబాబు తీరు అత్త మీద కోపం దుత్త మీద చూపినట్టుగా ఉందని విమర్శించారు. అప్పుడు జగన్ చేసిన తప్పే నేడు చంద్రబాబు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ అధికారంలో ఉండగా స్వర్గీయ ఎన్టీఆర్ పేరు మార్చి వైసీపీ ప్రభుత్వం అభిమానుల మనోభావాలు దెబ్బతినేలా చేస్తే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మహానేత

వివరాలు 2లో..

## యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలి ఏర్పాటు

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- 18 మంది సభ్యులతో వైటీడీ ట్రస్టు బోర్డు ఏర్పాటు
- వారికి జీతభత్యాలు ఉండవన్న మంత్రి కొండా సురేఖ
- ఐఏఎస్ అధికారి ఈవోగా వ్యవహరిస్తారని వెల్లడి




**పెన్ పవర్ డెస్క్:**యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. దేవాదాయ చట్ట సవరణ బిల్లుపై శాసనసభలో చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పద్దెనిమిది

వివరాలు 2లో..

## బెట్టింగ్ ఊబిలో యువత

### అప్రమత్తంగా ఉండాలంటున్న సీనియర్ ఐపీఎస్ సజ్జనార్



**పెన్ పవర్ డెస్క్:**బెట్టింగ్... ఈ పేరు వింటేనే ఎంతో మంది జీవితాలు ఛిద్రమైన ఉదంతాలు గుర్తుకు వస్తాయి. క్షణికావేశంలో, సు లువుగా డబ్బు సంపాదించాలనే అత్యా శతో ఈ వ్యసనంలో కూరుకుపోయి, ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలు ఎన్నో. ముఖ్యంగా యువత దీని బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ హెచ్చరికలు జారీ చేశారు. బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించే యూట్యూబర్లపై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు.

వివరాలు 2లో..

## ప్రాజెక్టులపై తెలంగాణ పిటిషన్.. కేంద్రం, ఏపీ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు

- కృష్ణా నది ప్రాజెక్టులపై తెలంగాణ ప్రభుత్వం రిట్ పిటిషన్
- సుప్రీంకోర్టులో విచారణ
- రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రం, ఏపీ ప్రభుత్వాలకు నోటీసులు



**పెన్ పవర్ డెస్క్:**కృష్ణా నదీ ప్రాజెక్టుల అంశంపై తెలంగాణ రాష్ట్రం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈరోజు విచారించింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

వివరాలు 2లో..



## ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మే 20న దేశవ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాల పిలుపు

- కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగాల సమాఖ్యల సమావేశం
- సమ్మెపై రెండు నెలల పాటు ప్రచారం
- లేబర్ కోడ్ రద్దు, నెలవారీ కనీస వేతనం సహా వివిధ డిమాండ్లతో సమ్మె

**పెన్ పవర్ డెస్క్:**ప్రైవేటీకరణను నిలిపివేయడంతో పాటు పలు డిమాండ్లతో మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు వివిధ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగాల సమాఖ్యలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో కార్మిక జాతీయ సమావేశం జరిగింది. దేశవ్యాప్త సమ్మెపై రెండు నెలల పాటు ప్రచారం నిర్వహించాలని కార్మిక సంఘాలు నిర్ణయించాయి.ఎలేబర్ కోడ్ రద్దు చేయడం, ఇండియన్ లేబర్ ప్రైవేటీకరణను నిలిపివేయడం, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ద్వారా క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపడం, నెలవారీ కనీస వేతనం రూ. 26,000, ఉద్యోగుల పెన్షన్ పథకం కింద నెలవారీ

వివరాలు 2లో..

ఎడిటర్ వ్యూ

# వెల్ కమ్ టూ సునీత....

సునీతా విలియమ్స్.. ఇప్పుడు ప్రపంచం మొత్తం ఆమె రాక కోసం ఎదురుచూస్తోంది. వారం రోజుల కోసమని అంతరిక్షంలోకి వెళ్లిన ఆమె.. 9 నెలల తర్వాత భూమి మీదకు రానున్నారు. ఐఎస్ఎస్‌తో.. నాసా క్రూ-10 మిషన్ డాకింగ్ ప్రక్రియ కూడా విజయవంతమైంది. దాదాపు 300 రోజుల తర్వాత ఆవిడ తిరిగి వచ్చారు గతేడాది అంతరిక్షంలోకి వెళ్లిన సునీత విలియమ్స్.. దాదాపు 300 రోజుల తర్వాత దివి నుంచి భువికి తిరిగిరానున్నారు. ఆమె రాక కోసం.. ఈ భూగోళమంతా ఎదురుచూస్తోంది. ఆవిడని తిరిగి రప్పించేందుకు.. నాసా చేపట్టిన క్రూ-10 మిషన్ డాకింగ్ ప్రక్రియ సైతం విజయవంతమైంది. ఆస్ట్రోనాట్స్.. కొత్త క్రూకు వెల్‌కమ్ చెప్పారు. ప్రస్తుతం ఐఎస్ఎస్‌లో 11 మంది ఆస్ట్రోనాట్స్ ఉన్నారు. 2 రోజుల పాటు హ్యాండోవర్ ప్రక్రియ పూర్తి కావడంతో బుధవారం సునీత విలియమ్స్.. భూమి మీదకు చేరుకున్నారు. సునీత విలియమ్స్.. అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారత సంతతి మహిళ. వ్యోమనౌకలో తలెత్తిన లోపాలతో.. ఆమె 9 నెలలుగా పైనే ఉండిపోయారు. గతేడాది జూన్ 5న సునీత అంతరిక్షంలోకి వెళ్లారు. తిరిగి అదే నెలలో భూమి మీదకు తిరిగి రావాల్సి ఉంది. కానీ.. అది జరగలేదు. సునీత స్పేస్‌లోకి వెళ్లి.. 280 రోజులు దాటింది. భూకక్ష్యకు సుమారు 400 కిలోమీటర్ల ఎత్తున ఉన్న ఇంటర్నేషనల్ స్పేస్ సెంటర్‌కి.. సునీతను, ఆమె సహ వ్యోమగామి బుచ్ విల్మోర్‌ని.. బోయింగ్ స్టార్‌లైనర్ విజయవంతంగా తీసుకెళ్లింది. వారిని అక్కడ దించేసిన తర్వాత.. అది పనిచేయడం మానేసింది. నాసా టీమ్ భూమి మీద నుంచి స్టార్‌లైనర్‌కు చేసిన రిపేర్లు కూడా పనిచేయలేదు. అలా.. వారం రోజుల కోసం వెళ్లి.. నెలల పాటు అంతరిక్షంలోనే ఉండిపోయిన సునీత విలియమ్స్.. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ క్రూ-10 వ్యోమ నౌకను స్పేస్‌లోకి పంపారుసునీత స్పేస్ ఎపిసోడ్‌లో గమ్మత్తైన విషయం ఏమిటంటే.. స్టార్ లైనర్ స్పేస్ షిప్‌ని టెస్ట్ చేసేందుకు వెళ్లిన సునీత, విల్మోర్.. అదే స్టార్ లైనర్ పనిచేయకపోవడంతో.. అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఇప్పుడు.. వాళ్లిద్దరూ క్షేమంగా భూమి మీదకు దిగి రావాలని అంతా కోరుకుంటున్నారు. నెలల పాటు అంతరిక్షంలోనే ఉండిపోవడం వల్ల.. సునీత ఆరోగ్య కాస్త క్షీణించింది. ఆవిడ బరువు తగ్గిపోయినట్లుగా తెలుస్తోంది. అంతరిక్షంలో పోషకాహార లోపాన్ని ఎదుర్కొంటున్నారని.. అందువల్ల బలహీనంగా కనిపిస్తున్నారని చెబుతున్నారు. దీర్ఘకాలంలో అంతరిక్షంలో ఉన్నవారికి.. స్పేస్ ఎనీమియా వస్తుంది. మైక్రో గ్రావిటీకి గురై.. ఎర్ర రక్తకణాల క్షీణత ఎక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు అంటున్నారు. అయితే.. ఇప్పటివరకు రిలీజైన ప్రతి ఫోటోలో.. సునీత ఆత్మవిశ్వాసంతో.. చిరునవ్వుతో కనిపించారు. అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన వ్యోమగాములను ఎలాగైనా భూమిపైకి తీసుకురావాలని నాసా విశ్వ ప్రయత్నాలు చేసింది. ప్రతిసారి ఏదో ఒక ఆటంకం ఏర్పడి.. పోస్ట్ పోన్ అవుతూ వచ్చింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ పగ్గాలు చేపట్టాక.. సునీతా విలియమ్స్, విల్మోర్‌ని.. భూమిపైకి తీసుకొచ్చే బాధ్యతను.. స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్‌కు అప్పగించారు. దాంతో.. వారి రాకపై ఓ క్లారిటీ వచ్చింది. మార్చి 19న నాసా క్రూ-10 మిషన్ ద్వారా.. వాళ్లిద్దరూ తిరిగి భూమికి వచ్చారు. 9 నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత.. ఎన్నో అనుమానాలని పటాపంచలు చేస్తూ.. సునీత, విల్మోర్ భూమిపై కాలు మోపనున్నారు. సునీతా విలియమ్స్ భారతీయ మూలాలున్న మహిళ. ఆమె తండ్రి గుజరాతీ. తల్లి ఉర్సులిన్ స్లోవేనియన్ మహిళ. సునీత అంతరిక్షంలోకి వెళ్లడం ఇది మూడోసారి. కానీ.. ఆవిడ గతంలో ఎప్పుడూ ఇన్ని రోజుల పాటు అంతరిక్షంలో ఉండలేదు. ఇప్పుడు ఆవిడ క్షేమంగా భూమిపైకి తిరిగి రావాలని అంతా కోరుకుంటున్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా.. మూలాల్ని మర్చిపోవద్దంటారు. ఈ విషయంలో.. సునీత విలియమ్స్ అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. భారతీయ మూలాలున్న ఆమె.. మన సంస్కృతిని, ఆధ్యాత్మికతను మర్చిపోలేదు. అంతరిక్షంలోకి వెళ్లినా.. భారతీయత గొప్పదనాన్ని చాటారు. ఇండియన్ యూత్‌కు.. స్ఫూర్తిగా నిలిచారు. అమెరికాలో పుట్టి పెరిగినా.. సునీతా విలియమ్స్ ఎప్పుడూ తన సాంస్కృతిక వారసత్వాన్ని మర్చిపోలేదు. ప్రతి మిషన్‌లో.. ఆమె తన భారతీయతని చాటే ప్రయత్నం చేసింది. ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కి భగవద్గీతను తీసుకెళ్లినా.. స్పేస్‌లోనే దీపావళిని జరుపుకున్నా.. ఆమె తన భారతీయ వారసత్వం పట్ల ఉన్న గౌరవాన్ని.. అనేక విధాలు ప్రదర్శించారు. బోయింగ్ స్టార్‌లైనర్‌లో అంతరిక్షంలోకి వెళ్లేటప్పుడు.. సమోసాలను తీసుకెళ్లారు. తనకెంతో ఇష్టమైన భారతీయ వంటకాల పట్ల.. ఆమెకున్న ప్రేమను వ్యక్తం చేశారు. అంతరిక్షంలో సునీతకు మరపురాని అనుభవం ఏదైనా ఉందంటే.. స్పేస్ స్టేషన్‌లో దీపావళి జరుపుకోవడమే. భారత్ నుంచి వలసెళ్లిన తన తండ్రిని గుర్తు చేసుకుంటూ.. దీపావళి జరుపుకున్నారు. భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో దీపావళిని జరుపుకోవడం వల్ల.. భారతీయ వారసత్వంతో ఆమెకున్న కనెక్షన్ ఎంత గొప్పదో అందరికీ అర్థమైంది. సాంస్కృతిక మూలాల్ని.. ఆమె ఎప్పటికీ మర్చిపోదనే విషయం.. అప్పుడే తెలిసింది. సునీతా విలియమ్స్.. తన జీవితంలో ముఖ్యమైన మార్గదర్శకాలుగా ఉన్న భగవద్గీతని సైతం అంతరిక్షంలోకి తీసుకెళ్లారు. అందులోని బోధనలు.. ఆమెకు బలాన్ని, ఓదార్పును అందించాయని తెలిపారు. స్పేస్ స్టేషన్‌లో.. ఈ పవిత్ర గ్రంథాలు ఆమెకు శాంతిని చేకూర్చాయి. విశ్వంలోని సుదూర ప్రాంతాల్లోనూ లోతుగా పాతుకుపోయిన ఆధ్యాత్మికత.. ఎలాంటి మార్గదర్శకత్వాన్ని అందించగలదో సునీత చూపించారు. తన కెరీర్ అంతటా.. సునీత ఎంతోమంది భారతీయ యువతకు స్ఫూర్తిగా నిలిచారు. ఆమె సక్సెస్ స్టోరీ.. చాలా మందికి సైన్స్, టెక్నాలజీ, అంతరిక్ష పరిశోధనల్లో కెరీర్ కొనసాగించేందుకు ప్రేరణనిచ్చింది. యువత.. తమని తాము బలంగా నమ్మలని.. అత్యున్నత శిఖరాలు చేరుకోవాలని ప్రోత్సహించారు. సునీత జర్నీ.. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. అంకితభావం, కృషితో.. ఏదైనా సాధ్యమేనని నిరూపిస్తుంది. సునీత.. తన అంతరిక్ష ప్రయాణంలో.. వినాయకుడి విగ్రహాన్ని కూడా తీసుకెళ్లారు. గణపతి తన జీవితంలో మార్గదర్శిగా ఎలా ఉన్నాడో.. ఆమె వివరించారు. గణేశుడిని అంతరిక్షంలోకి తీసుకెళ్లడం ద్వారా.. సునీతా విలియమ్స్ తన భారతీయ మూలాలతో ఉన్న సంబంధాన్ని.. ఈ ప్రపంచానికి చాటి చెప్పింది. తన సంస్కృతి, ఆధ్యాత్మికతలో కొంత భాగాన్ని.. అంతరిక్షం దాకా మోసుకెళ్లింది. ఆమె ఎంత దూరం ప్రయాణించినా.. సాంస్కృతిక, ఆధ్యాత్మిక గుర్తింపు.. ఆమె ప్రయాణంలో ప్రధాన భాగంగా ఉందని తెలియజేసింది. ఈ చర్యలన్నింటితో.. భారతీయ వారసత్వంతో తనకున్న సంబంధాన్ని.. అంతరిక్షం నుంచి అందరికీ చాటి చెప్పింది సునీతా విలియమ్స్.

# బెట్టింగ్ ఊబిలో యువత

- మొదటి పేజీ తరువాయి

లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు సైతం కాసులకు కక్కుర్తిపడి బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ యువతను తప్పుదోవ పట్టిస్తున్నారు. దీనిపై స్పందించిన సజ్జనార్, బెట్టింగ్ యాప్‌ల ప్రచారం వల్ల అమాయక ప్రజల ప్రాణాలు తీయొద్దని విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ కొందరు వినిపించుకోకపోవడంతో వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు కూడా చేశారు. "చాలామంది సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నారు. దీనివల్ల సులువుగా డబ్బు సంపాదించవచ్చని అనుకుంటున్నారు. గత కొద్ది నెలలుగా నేను ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బెట్టింగ్ యాప్‌లపై పోస్టులు పెడుతున్నాను. వైజాగ్ సీపీ గారు కూడా ఒక సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ మీద కేసు పెట్టారు. ఎవరూ చట్టానికి అతీతులు కారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తే క్రిమినల్ కేసులు తప్పవు. దీనివల్ల మీకున్న ఫాలోయింగ్ తగ్గిపోతుంది. కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. మీ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. బెట్టింగ్ యాప్‌లే కాదు, ఏ చట్టవిరుద్ధమైన, అనైతిక వ్యాపారాలను ప్రోత్సహించవద్దు" అని సజ్జనార్ హెచ్చరించారు. అప్పులు చేసి బెట్టింగ్‌లలో పాల్గొని, ఆపై వాటిని తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి గురించి ఆయన ప్రస్తావించారు. యువత బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల మాటలను నమ్మవద్దని కోరారు. ఎవరైనా నష్టపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధించేందుకు చట్టం తీసుకువస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బెట్టింగ్‌లు నిషేధించబడ్డాయి, కానీ ఇప్పుడు అంతా ఆన్‌లైన్‌లో జరుగుతోంది కాబట్టి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని మోసాలు చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. చైన్ సిస్టమ్, ఓఎల్ఎక్స్ ఫ్రాడ్, ఓటీపీ ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ వంటి మోసాల గురించి ఆయన గుర్తు చేశారు. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా వీటిని అరికట్టవచ్చని అన్నారు. ప్రస్తుతం మార్కెట్లో వేలాది బెట్టింగ్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయని, వీటిని ప్రోత్సహించే యూట్యూబర్లను, ప్రచారకర్తలను నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. క్రికెటర్లు, సినీ స్టార్లు, టీవీ సీరియల్ నటులు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు డబ్బు కోసం ఇలాంటి వాటిని ప్రోత్సహించకూడదని ఆయన అన్నారు. కష్టపడి పనిచేస్తేనే డబ్బు వస్తుందని, షార్ట్‌కట్ మార్గాల్లో

డబ్బును ఆశిస్తే నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే యూట్యూబర్లను బహిష్కరించాలని పిలుపునివ్వడంతో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని సజ్జనార్ తెలిపారు. "సే నో టు బెట్టింగ్ యాప్స్" అనే ఉద్యమం ఊపందుకుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

చివరగా, యువత బెట్టింగ్‌లకు బానిసలు కాకుండా ఉండాలంటే కష్టపడి పనిచేయాలనే ఆలోచనను ప్రోత్సహించాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని ఆయన సూచించారు. పిల్లలు డబ్బు కోసం ఎవరినైనా అడుగుతున్నారా, లోన్ యాప్‌లను ఉపయోగిస్తున్నారా అనేది గమనించాలని, వారిలో మార్పు కనిపిస్తే వెంటనే కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. రాబోయే రోజుల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరోతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తామని సజ్జనార్ తెలిపారు.

# తక్కువ ద్రవ్యోల్బణం నమోదవుతున్న రాష్ట్రాలలో నాలుగో స్థానంలో ఏపీ

- మొదటి పేజీ తరువాయి

మంత్రులు వివరించారు.

జాతీయ సగటు 3.61% కంటే ఆంధ్రప్రదేశ్ ద్రవ్యోల్బణం రేటు 2.44% తక్కువగా ఉన్న విషయాన్ని వారు ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా తక్కువగా ద్రవ్యోల్బణం నమోదవుతున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉందని వెల్లడించారు. వరుసగా 3 నెలలు జాతీయ సగటు కన్నా రాష్ట్ర ద్రవ్యోల్బణం తక్కువగా నమోదు అవుతోందని స్పష్టం చేశారు. ఇక, రాష్ట్రవ్యాప్తంగా 154 మండల కేంద్రాలు, 151 రైతు బజార్ల నుంచి ప్రతిరోజు సీపీ యాప్ ద్వారా ధరలను సేకరించి వాటిపై విశ్లేషణ చేస్తున్నట్లు అధికారులు మంత్రులకు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 13 జిల్లాలకు ఉన్న ధర నివేదిక కేంద్రాలను 26 జిల్లాలకు పెంచేలా ఏప్రిల్ నుంచి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలను ఎప్పటికప్పుడు సమీక్షించి, వాటిని నియంత్రించేందుకు

చర్యలు తీసుకోవాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. వస్తు రవాణా చార్జీలలో ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు రవాణా శాఖ వారు తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. బియ్యం, కందిపప్పు, వంట నూనె, టమాటా, ఉల్లిపాయల ధరల స్థిరీకరణపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

ధాన్యంపై మార్కెట్ రుసుము రెండు శాతం నుంచి ఒక శాతం తగ్గించేందుకు.... క్యాబినెట్ ఆమోదానికి నివేదిక తయారు చేయాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. తృణధాన్యాల ఉత్పత్తి పెంచేందుకు, రైతులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

# అప్పుడు జగన్ చేసిన తప్పే ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

వైఎస్సార్ పేరు చెరిపి ప్రతీకారం తీర్చుకుంటోందని ఆరోపించారు. తద్వారా చంద్రబాబు ప్రభుత్వం కోట్లాది మంది తెలుగు ప్రజల హృదయాలను గాయపరిచిందని తెలిపారు.

"వైఎస్సార్ జిల్లాను తిరిగి వైఎస్సార్ కడప జిల్లా పేరుతో సవరించడంలో అభ్యంతరం లేకపోయినా... కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరును తీసెయ్యడాన్ని ఖండిస్తున్నాం. వైఎస్సార్ అంటే ఎందుకింత కక్ష అని అడుగుతున్నాం. వైఎస్సార్ జిల్లాలో తిరిగి కడప పేరు చేర్చినప్పుడు... విజయవాడ కేంద్రంగా ఉన్న ఎన్టీఆర్ జిల్లాకు ఎన్టీఆర్ విజయవాడ అనో లేక పాత కృష్ణ జిల్లాకు ఎన్టీఆర్ కృష్ణా జిల్లాగా పేరు ఎందుకు మార్చలేదు? అని ప్రశ్నిస్తున్నాం. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి.

దేశంలోనే సంక్షేమ పథకాలకు ఆద్యుడు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నేత. ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు లాంటి ప్రజాకర్షక పథకాలకు రూపశిల్పి మహానేత వైఎస్సార్. తెలుగు వారు తమ గుండెల్లో గుడి కట్టుకొని, ఇంట్లో దేవుడి ఫోటోల పక్కన వైఎస్సార్ ఫోటో పెట్టుకొని పూజిస్తున్న గొప్ప నేతకు రాజకీయాలు ఆపాదించడం సరైంది కాదు. ఇది ఆయనకు ఇచ్చే గౌరవం అంతకన్నా కాదు. వైఎస్సార్ అనే పేరు ప్రజల ఆస్తి. ఆయన ఏ ఒక్కరి సొత్తు కాదు. వైఎస్సార్ తెలుగు వారి సొత్తు" అని షర్మిల స్పష్టం చేశారు.

# యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలి ఏర్పాటు

- మొదటి పేజీ తరువాయి

మంది సభ్యులతో యాదగిరిగుట్ట ట్రస్టు బోర్డు (వైటీడీ) ఉంటుందని వెల్లడించారు. ఈ బోర్డు పదవీ కాలాన్ని రెండు సంవత్సరాలుగా నిర్ణయించామని, బోర్డు చైర్మన్, సభ్యులకు ఎలాంటి జీతభత్యాలు ఉండవని స్పష్టం చేశారు.

వైటీడీకి బడ్జెట్ ఆమోదం ప్రభుత్వం ద్వారా జరుగుతుందని మంత్రి తెలిపారు. ఐఏఎస్ అధికారి ఈవోగా ఉంటారని వెల్లడించారు. వైటీడీ బోర్డు విద్యా సంస్థలను స్థాపించవచ్చు, నిర్వహించవచ్చని తెలిపారు. యాదగిరిగుట్టలో ఆధ్యాత్మిక, వేద పాఠశాలలను స్థాపించుకోవచ్చని తెలిపారు.

గతంలో యాదగిరిగుట్ట భక్తులకు సరైన వసతులు లేవని ఆమె అన్నారు. కోట్లాది రూపాయలు

ఖర్చు చేసి ప్రభుత్వం వసతులను ఏర్పాటు చేసిందని తెలిపారు. యాదగిరిగుట్టను మరింత మెరుగుపరిచేందుకే పాలక మండలిని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఏటా రూ. 100 కోట్ల ఆదాయం వచ్చే ఆలయాలు దేవాదాయ శాఖ పరిధిలోకి వస్తాయని ఆమె స్పష్టం చేశారు.

# అసెంబ్లీలో అరకు కాఫీ స్టాల్ ప్రారంభం... చంద్రబాబు, పవన్ మధ్య సరదా క్షణాలు



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అరకు కాఫీ స్టాల్ ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమంలో పాల్గొని, సరదాగా గడిపారు.

అరకు కాఫీకి విస్తృత ప్రాచుర్యం కల్పించేందుకు చంద్రబాబు ప్రభుత్వం గట్టిగా కృషి చేస్తోంది. ఇప్పటికే పార్లమెంటులో అరకు కాఫీ కేఫ్ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. తాజాగా, ఏపీ అసెంబ్లీ ఆవరణలోనూ అరకు కాఫీ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఇవాళ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అసెంబ్లీలో అరకు కాఫీ స్టాల్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం, డిప్యూటీ సీఎం మధ్య సరదా క్షణాలు చోటుచేసుకున్నాయి. చంద్రబాబు స్వయంగా కాఫీ కప్ అందించగా... పవన్ చిరునవ్వుతో స్వీకరించారు. చంద్రబాబు తదితరులు ఈ స్టాల్ లో ఉంచిన పలు అరకు కాఫీ ఉత్పత్తులను కూడా ఆసక్తిగా పరిశీలించారు.

# ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మే 20న దేశవ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాల పిలుపు

- మొదటి పేజీ తరువాయి

పెన్షన్ రూ. 9,000 అందించడం సహా పలు డిమాండ్లు ఉన్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే విరాళాలతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి, దాని ద్వారా ఏ పథకం కిందకు రానివారికి నెలకు రూ. 6,000 ఇవ్వాలని కూడా యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.

రెండు నెలల తర్వాత నిర్వహించే సమ్మె, భవిష్యత్తులో కార్మికులు, రైతుల దేశవ్యాప్త నిర్ణయాత్మక పోరాటాలకు నాంది పలుకుతుందని కార్మిక సంఘాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

# వేల మైళ్ల దూరంలో ఉన్నప్పటికీ.. మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు..

**పెన్ పవర్ డెస్క్:** భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ 9 నెలల తర్వాత భూమికి తిరిగి వస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు సునీతా విలియమ్స్‌కు లేఖ రాశారు. మీరు భారతీయుల హృదయాల్లో నిలిచి ఉన్నారని పేర్కొన్నారు. సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ సుమారు తొమ్మిది నెలల పాటు అంతరిక్ష కేంద్రంలో ఉన్నారు. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున గం.3.27 నిమిషాలకు వారు భూమి పైకి చేరుకుంటారని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ రాసిన లేఖను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' వేదికగా షేర్ చేశారు. మీరు వేల మైళ్ల దూరంలో ఉన్నప్పటికీ మా హృదయాలకు దగ్గరగానే ఉన్నారని పేర్కొన్నారు. భారత ప్రజలు మీరు ఆరోగ్యంగా ఉండాలని, ఈ మిషన్‌లో మీరు విజయం సాధించాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. మీరు తిరిగి వచ్చిన తర్వాత భారత్ లో పర్యటిస్తారని ఆశిస్తున్నాం అని మోదీ లేఖలో తెలిపారు.

# ప్రాజెక్టులపై తెలంగాణ పిటిషన్.. కేంద్రం, ఏపీ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

కౌంటర్లు దాఖలైన వారం రోజుల్లో రిజాయిండర్ ఫైల్ చేయాలని కూడా ఆదేశించింది. కృష్ణా నది ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌ను తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. తెలంగాణ అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని వాడుకుంటోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ మేరకు తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.

# విజయవాడలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీలు ప్రారంభం

- మొదటి పేజీ తరువాయి

రాంప్రసాద్ రెడ్డి... శాప్ చైర్మన్ రవి నాయుడు సమన్వయంతో ఈ స్పోర్ట్స్ ఈవెంట్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ క్రీడల పోటీల్లో పాల్గొనేందుకు 70 శాతం మంది ఎమ్మెల్యేలు తమ పేర్లను నమోదు చేయించుకున్నారని మంత్రి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు. ఇక సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ సాయంత్రం ఢిల్లీ వెళుతుండడంతో, వారు రేపు గానీ, ఎల్లుండి గానీ ఈ క్రీడల పోటీలకు హాజరుకానున్నారు. సీఎం చంద్రబాబు విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారు. కాగా, ఆటల పోటీల్లో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, త్రోబాల్, టెన్నికాయిట్ క్రీడాంశాలతో పాటు అథ్లెటిక్స్ కూడా నిర్వహించనున్నారు. మొత్తం 13 రకాల క్రీడల్లో పోటీలు జరగనున్నాయి. 175 మంది ఎమ్మెల్యేల్లో 140 మంది... 58 మంది ఎమ్మెల్సీల్లో 13 మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

# ముగిసిన పోసాని సీఐడీ విచారణ

ప్రముఖ నటుడు పోసాని కృష్ణమురళి సీఐడీ విచారణ పూర్తయింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో ఆయనను విచారించారు. విచారణ అనంతరం జైలుకు తరలించగా, సీఐడీ మరోసారి విచారణ కోసం కోర్టును ఆశ్రయించనుంది. పోసాని బెయిల్ పిటిషన్ విచారణ బుధవారానికి వాయిదా పడింది. ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణమురళి సీఐడీ విచారణ ముగిసింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో ఈరోజు పోసానిని ఏపీ సీఐడీ అధికారులు విచారించారు. కోర్టు పోసానిని ఒక రోజు సీఐడీ కస్టడీకి ఇచ్చిన సంగతి తెలిసిందే. విచారణ ముగియడంతో ఆయనకు గుంటూరు జీజీహెచ్ లో వైద్య పరీక్షలు నిర్వహించి జిల్లా జైలుకు తరలించారు. దాదాపు నాలుగు గంటల సేపు విచారణ కొనసాగింది. అయితే, పోసానిని మరోసారి విచారించాలని సీఐడీ నిర్ణయించింది. దీనికోసం మరోసారి కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరనుంది. మరోవైపు పోసాని బెయిల్ పిటిషన్ పై విచారణను కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. పీటీ వారెంట్ పై పోసానిని కర్నూలు నుంచి గుంటూరుకు తరలించిన సంగతి తెలిసిందే.

## వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా..

**గిద్దలూరు పెన్ వర్ మార్చి 18**

రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ మరణించగా, పిచ్చమ్మ భౌతిక కాయానికి నివాళులు అర్పించడానికి మేదరమెట్ల కు విచ్చేసిన వైస్సార్సీపీ అధ్యక్షులు, మాజి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని గిద్దలూరు మాజి శాసనసభ్యులు అన్నా రాంబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల లో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై జగన్ ఆరా తీసినట్లు సమాచారం. అన్నా రాంబాబు వెంట, రాష్ట్ర వైకాపా నాయకులు, అన్నా తనయుడు కృష్ణ చైతన్య ఉన్నారు.



పెన్ పవర్ ప్రకాశం



# "మినరల్" పేరుతో మోసం

**జోరుగా సాగుతున్న నీటి వ్యాపారం**
**అనారోగ్యానికి గురి అవుతున్న జనం**
**మామూళ్ల మత్తులో అధికార గణం**



**పొదిలి, పెన్ పవర్ మార్చి 18**

పొదిలిలో మినరల్ పేరుతో మోసం జరుగుతోంది స్వచ్ఛమైన నీరుగా చెప్పుకుంటూ వాటర్ ప్లాంట్ల యజమానులు బోర్ల నీటి వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు పొదిలి పట్టణంలో ఉన్న నేటి సమస్యను ఆసరాగా తీసుకుని పలువురు వాటర్ ప్లాంట్లను నెలకొల్పి, నాణ్యత, స్వచ్ఛత లేని నీటిని విక్రయిస్తూ అనతి కాలంలోనే లక్ష్యాధికారులుగా మారుతున్నారు అయితే గత్యంతరం లేక డబ్బులు ఇచ్చి మరి మినరల్ వాటర్ పేరుతో విక్రయిస్తున్న నీటిని కొనుగోలు చేసి వినియోగించడం ద్వారా ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారు పొదిలి ప్రాంతంలో అధికారుల పర్యవేక్షణ, అజమాయిషి లేకపోవడంతో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు అధికారుల అనుమతి తో పాటు నీటి స్వచ్ఛత, నాణ్యతను సంబంధిత అధికారులు పరిశీలించాల్సి ఉంది అయితే ఆయా నిబంధనలకు అధికారులు పాటించకపోవడంతో వాటర్ ప్లాంట్ల యజమానుల నీటి వ్యాపారం ఇష్టారాజ్యంగా మారిందని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు చచ్చేంతనం లేక బోర్ల నీటినే డబ్బులు ఇచ్చి మరీ కొనుక్కొని అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు వాటర్ ప్లాంట్ల నిర్వహణ, నీటి సరఫరా తీరుతెన్నులు తోపాటు నీటి స్వచ్ఛత పరీక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో పడి తమకు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి దీంతో ఇక్కడి వాటర్ ప్లాంట్ల నీటి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుందని పలువురు ఆక్షేపిస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని వాటర్ ప్లాంట్ల పనితీరును, నేటి సరఫరా విధానాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.



## నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వం లక్ష్యం

**- జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా**




**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 18**

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్య అందడమే లక్ష్యంతో పనిచేస్తున్నదని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, తమీమ్ అన్సారియా, విద్యా శాఖాధికారులతో సమావేశమై జి.ఓ. 117, డ్రాప్ అవుట్స్ తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జీవో 117ను ఉపసంహరించిన తర్వాత అందుకు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ప్రారంభించి ఇప్పటికే సన్నాహక మార్గదర్శకాలపై ఉత్తర్వులు కూడా విడుదల చేసిందన్నారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో కూడా సంబంధిత విద్యా శాఖల అధికారులు, పాఠశాలల అభివృద్ధి కమిటీ ప్రతినిధులతో అధ్యయనం చేపట్టడం జరిగింద న్నారు. ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల అమలుపై పిల్లల తల్లితండ్రులను సంప్రదించి వారికి వివరించి తరువాత వారి అభిప్రాయాలను తెలుసుకునేలా ఎంఈఓ లు గ్రామపంచాయతీ స్థాయిలో సమావేశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆ పంచాయతీ పరిధిలో ఉన్న పాఠశాల కమిటీల సమావేశంలో స్కూళ్ల వివరాలను వారికి అర్థమయ్యే విధంగా వివరించి నిర్ణయాలను లిఖితపూర్వకంగా ఆమోదం పొందే విధంగా అందరూ ఎంఈఓ లు చూడాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ అమలు ప్రక్రియలో మండల, క్లస్టర్ కమిటీల ఏర్పాటు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ తో సంప్రదించి, తల్లితండ్రుల అంగీకారంతో ఈ పనులు పూర్తి చేయాలని అన్నారు. ఈ ప్రక్రియ అమలు గురించి శాసనసభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో చర్చించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, మండల విద్యా శాఖాధికారులను ఆదేశించారు. నిర్దేశించిన గడువులోపు ఈ ప్రక్రియ పూర్తి చేసేలా విద్యా శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. డ్రాప్ అవుట్ పిల్లలు ఎందుకు డ్రాప్ ఓట్ అవుతున్నారో గుర్తించి వారిని బడిలో చేర్పించేలా విద్యా శాఖాదికారులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్ కుమార్, జిల్లాలోని మండల విద్యా శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ పాలెంలో లో ఓల్టేజీ సమస్య

**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 18**

పుల్లల చెరువు మండల కేంద్రము ఎస్సీపాలెంలో విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లో ఓల్టేజీ కారణంగా ఇంట్లో విద్యుత్ వాడకం ఎక్కువైతే ఫ్యాన్లు, లైట్లు పని చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు.మంచినీటి మోటర్లు వేస్తే ఇళ్లల్లో కరెంటు నిలిచిపోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, కానీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కాలనీలో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినా విద్యుత్ వినియోగం పెరగడంతో ఇక్కడ లో ఓల్టేజీ సమస్య బాగా ఉంది. మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసీ కరెంట్ లైన్ లాగరు కానీ కనెక్షన్ ఇయ్యలేదని కాలని వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.లో ఓల్టేజితో గృహాలలో ఫ్యాన్లు తిరగటం లేదని, కనీసం బల్బులు కూడా వెలగటం లేదని ఆవేదన చెందుతున్నారు.ఎన్ని మారులు అధికారులు దృష్టికి తీసుకెళ్లిన బుకాయిస్తున్నారే కాని సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కి కనెక్షన్ ఇచ్చి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.ట్రాన్స్‌కో అధికారులు స్పందించి లో ఓల్టేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలి. గత సంవత్సరం నుంచి కాలనీలో ప్రజలు లో ఓల్టేజీ సమస్యను ఎదుర్కొంటున్నారు. సమస్య కారణంగా మోటర్లు పని చేయక ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కి కనెక్షన్ ఇచ్చి ఎస్సీ కాలనిలో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి.



## డ్రోన్ కెమెరాతో ప్రత్యేక నిఘా

**జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్**

**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 18**

ప్రకాశం జిల్లా పరిధిలో లా అండ్ ఆర్డర్, నేరాలు – ట్రాఫిక్ నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా, విపత్తు నిర్వహణ, ఇతర పోలీసింగ్ అవసరాల కొరకు కురిచేడు మండలం, ఆవులమంద గ్రామానికి చెందిన గొట్టిపాటి వెంకటేశ్వర్లు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కి అత్యాధునిక సాంకేతికత కూడిన డ్రోన్ కెమెరాలు అందచేశారు. ఈ సందర్బంగ ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ జిల్లాలో నేరాలను నియంత్రించే చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా నేరాలు నియంత్రణ, జూద కార్యకలాపాలు మరియు బహిరంగ మద్యపానం ఎక్కడ జరిగినా డ్రోన్ టెక్నాలజీతో పసిగడతామని, ఆయా ప్రాంతాలపై నిఘా పెట్టేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని, పోలీసులకు ఒక డేగ కన్ను లాగా ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులను కఠినంగా ఎదుర్కొంటామని, ప్రజల సహకారంతో నేర నియంత్రణ మరింత సమర్థంగా నిర్వహించగలమన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలను పరిరక్షించడంలో సాంకేతికత యొక్క పాత్ర చాలా ముఖ్యమైనదని, నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు, ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్ టీజింగు, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ఏరియాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాలు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను, తోటలు, బహిరంగ ప్రదేశాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజిబుల్ పోలీసింగ్, వివిధ విఐపిల బందోబస్తులలో ఎక్కడ ఎటువంటి




అవాంఛనీయలు జరగకుండా డ్రోన్ కెమెరాలను ఉపయోగించడం జరుగుతుందని, ముఖ్య కూడళ్ళలో ట్రాఫిక్ నియంత్రణ, సుదూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టేందుకు డ్రోన్స్ వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రిపురాంతకం సీఐ జి.అస్సన్, ఆవులమంద గ్రామానికి చెందిన గొట్టిపాటి రామయ్య,డి.ఏడుకొండలు, కె.కాశీవిశ్వనాథ్ రావు, వి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలలో ప్రారంభమైన ఒంటిపూట ప్రీ స్కూల్స్

ఈనెల 18 నుంచి ఒంటిపూట ప్రీ స్కూల్స్ నిర్వహణకు ఉత్తర్వులు.

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేంద్రాలు నిర్వహించాలి.

కొమరోలు మండలంలోని అంగన్వాడి కేంద్రాలలో ఒంటి పూట ప్రీ స్కూల్స్ అమలు చేయాలి.

కొమరోలు ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి.






**కొమరోలు, పెన్ పవర్ మార్చి 18**

అంగన్వాడి కేంద్రాలలో ఈ నెల 18 నుంచి ఒంటిపూట ప్రీ స్కూల్స్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని కొమరోలు ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతను , వడగాడుపులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలలో కూడా ఒంటి పూట ప్రీ స్కూల్స్ ను నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసిందని ఆమె చెప్పారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంగన్వాడీ కేంద్రాలు నిర్వహించాలని, 12 గంటల లోపే మధ్యాహ్న భోజనం తప్పనిసరిగా అందించాలని ఆమె ఆదేశించారు. చిన్నారులు ఎండ తీవ్రతకు, వడగాడు పులకు గురికాకుండా వారిని సురక్షితంగా ఇండ్లకు చేర్చే ఏర్పాట్లు చేయాలని ఆమె అంగన్వాడి కేంద్రాల్లో టీచర్లు ఆయాలను కోరారు .మండలంలోని అన్ని అంగన్వాడి కేంద్రాలలో ఈనెల 18 నుంచి తప్పనిసరిగా ఒంటిపూట ప్రీ స్కూల్స్ ను నిర్వహించాలని ఆమె కోరారు.

## మాగుటూరు, కాకర గ్రామలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం





**అర్థవీడు, పెన్ పవర్, మార్చి 18**

మండలంలోని మాగుటూరు, కాకర గ్రామలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి ఎస్కె మహమ్మద్ మాట్లాడుతూ రైతు సోదరులు అందరూ ఎవరైతే కందులు శనగ పంట సాగు చేశారో వారు ప్రభుత్వ మద్దతు ధర అమ్ముకోవాలని అనుకుంటే సంబందిత రైతు సేవ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కందులకు రూ 7550 లు, శనగ పంటకు రూ 5650లు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అమ్మిన తరువాత వారం రోజుల్లోపు నగదు రైతుల అకౌంట్లో జమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రమాదేవి, శాకీర్ పాల్గొన్నారు.

# సిఫారసు మేరకే రసాయనిక ఎరువులు వినియోగించాలి

### ఏప్రిల్ నెలలో 50% రాయితీ పై పచ్చి రొట్ట విత్తనాలు

### 50శాతం రాయితీ పై వ్యవసాయ పనిముట్లు -ఏడిఏ ఎగ్గోని వెంకటరమణ





**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 18**

రైతులు అవసరానికి మించి రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడడం వలన నేల యొక్క భూ భౌతిక లక్షణాలు దెబ్బతినడంతో పాటు సేంద్రియ కర్బనం కూడా తగ్గి భూములన్ని నిస్సారమైపోతున్నాయని కనిగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు (రె ),ఎగ్గొని.వెంకటరమణ తెలిపారు చంద్రశేఖరపురం మండలంలోని చెన్నపునాయినపల్లి మరియు రేగులచెలక గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి బి.సంపత్ కుమార్ గారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామంలో సాగు చేసినటువంటి మొక్కజొన్న మరియు వరి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం వరి పంటలో తీసుకోవలసినటువంటి సమగ్ర సస్యరక్షణ పద్ధతులను గురించి రైతులకు వివరించారు అనంతరం రైతుల తోటి సమావేశం నిర్వహించారు . ఈ సమావేశంలో ఏడిఏ ఎగ్గోని వెంకటరమణ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులందరూ సేంద్రియ ఎరువులు వాడకుండా అవసరానికి మించి రసాయనక ఎరువులు ఎక్కువగా వాడడం వలన నేలలన్నీ నిస్సారమైపోతున్నాయని తెలిపారు. నేలలో సేంద్రీయ కర్బనం ఎక్కువగా ఉన్నప్పుడు నేల లో మేలు చేసేటటువంటి కోట్లను కోట్ల సూక్ష్మజీవులకు సేంద్రీయ కర్బనం అనేది ఆహారంగా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ మేలు చేసే సూక్ష్మజీవులు చర్యల వలన అందుబాటులో లేనటువంటి పోషకాలు అన్నీ కూడా అందుబాటులోకి వచ్చి మొక్కలు తీసుకునే విధంగా చేస్తాయని తెలియజేశారు. కావున రైతులందరూ తప్పనిసరిగా సేంద్రీయ ఎరువులు వాడవలనని తెలిపారు. పశువుల ఎరువు లభ్యం కాని చోట పచ్చిరొట్ట విత్తనాలు అయినటువంటి జనము, జీలుగామరియు పిల్లి పెసర విత్తనాలు సాగు చేసి పూతకు వచ్చిన వెంటనే భూమిలో కలియ దున్ని నట్లయితే భూమిలో సేంద్రీయ కర్బనం శాతం పెరిగి భూములుసారవంతమవుతాయని తెలిపారు. ఏప్రిల్ నెలలో 50 శాతం రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు రైతులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనంతరం భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం గురించి రైతులకు వివరించారు అదేవిధంగా వ్యవసాయ శాఖలో ప్రస్తుతం 50 శాతం రాయితీపై వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు సన్న,చిన్న కారు, గత ఆరు సీజన్లో తప్పనిసరిగా ఒకసారి ఐనా పంట నమోదైన వారు మరియు గత ఐదు సంవత్సరముల నుండి ఒక ఇంప్లిమెంట్ కూడా తీసుకోకుండా ఉన్నవారు మాత్రమే అర్హులని తెలియజేశారు. కొన్ని రకాల పనిముట్లకి సబ్సిడీ అనేది సీలింగ్ ఉందని తెలియజేశారు కావలసినటువంటి రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించవలసినదిగా తెలియజేశారు. కంది సాగు చేసినటువంటి రైతులు క్వింటా కందులు 7550 /- మద్దతు ధర కంటే తక్కువగా దళారులు ఎవరికి అమ్ముకోవద్దని తెలియజేశారు. ఏపీ మార్క్ఫెడ్ మరియు నా ఫెడ్ ద్వారా ప్రభుత్వం వారు కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి బి సంపత్ కుమార్ మాట్లాడుతూ పొలం ఉన్నటువంటి ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలియజేశారు. ఈనెల 31వ తేదీ లోపల %ఖీ% పీఎం కిసాన్ పడేటటువంటి రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ రైతు సేవ కేంద్రం నందు చేయించుకోవాలని తెలియజేశారు ఫార్మర్ రిజిస్ట్రేషన్ వలన కలుగు ప్రయోజనాలను గురించి రైతులకు వివరించారు. అనంతరం వ్యవసాయ మరియు అనుబంధ శాఖ తరపున అమలవుతున్నటువంటి వివిధ పథకాలను గురించి రైతులకు వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి.శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం.వెంకటేశ్వర్లు, వి చిరంజీవి మరియు ఆయా గ్రామాలలోని రైతులు పాల్గొన్నారు

# పొలంలో భూసార పరీక్ష

### భూసార పరీక్షలు చేయించుకోవాలి

### మండల వ్యవసాయాధికారి భాస్కర్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 18**

గిద్దలూరు కొత్తపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలో మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భూసార పరీక్ష ఆవశ్యకతను,దాని వల్ల కలిగే లాభాలు, మట్టి నమూనా సేకరణ వివిధ దశలు,మట్టి నమూనా సేకరణ లో తప్పనిసరిగా తీసుకోవలిసిన జాగ్రత్తలు,ప్రయోగ శాలలో పరీక్ష పంపే విధానం,సమగ్ర పోషక యాజమాన్య పథకం ద్వారా నేల సారవంతం ను బట్టి ఎరువులు, తగు యాజమాన్య చేసే విధంగా పద్ధతుల ద్వారా రైతులకు మేలు చేసే విదంగా పలు అంశాలను చర్చించారు. మట్టి నమూనాలను గట్ల ప్రక్కన, చెట్ల నీడలో, నీళ్లు నిలబడే చోట, గుంటల్లో మొదలైన చోట్ల తీయరాదని అలాగే మట్టి నమూనాలు తప్పనిసరిగా చదరంగా ఉన్న చోటే తీయాలని , ఒక మట్టి నమూనా విశ్లేషణ 5 ఎకరాలకు సరిపడ భూమిలో మట్టి నమూనాలు తీసినట్లు అర్థం చేసుకోవాలని తెలిపారు. అలాగే మట్టి నమూనాలను ఖచ్చితంగా "వి" ఆకారంలోనే తీసుకోవాలని, తరువాత చుట్టు పక్కల భూమిలోని అన్నీ పొరలు వచ్చేట్లు నమూనా సేకరించాలని , తరువాత నీడలో ఆరబెట్టి చతుర్విభజన పద్ధతి ద్వారా చివరికి 500 గ్రాముల మట్టిని నమూనాగ పరిగణలోకి తీసుకోవాలని వివరించారు. భూసార పరీక్ష పత్రాల లో వచ్చిన విశ్లేషణ ఆధారంగా సిఫారసు ప్రకారమే రసాయనికి ఎరువులు వాడుకోవాలని, విచక్షణారహితంగా వాడుకోరాదని దీని వలన నేల ఆరోగ్యం కాపాడుకోవచ్చని, భావి తరాలకు ఆరోగ్యవంతమైన భూములు ఇవ్వవచ్చని తెలిపారు. ఇప్పటినుండి సూక్ష్మ పోషకాలు సబ్సిడీ పై పొందాలంటే తప్పనిసరిగా భూసార పరీక్షా విశ్లేషణ పత్రం తప్పక ఉండాలని ప్రభుత్వం వారు నిర్ణయించారు కావున ప్రతి ఒక్కరూ భూసార పరీక్షలు చేయించుకొని కార్డు పొందాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్ రెడ్డి గ్రామ వ్యవసాయ సహాయకులు సుభాని రైతులు పాల్గొన్నారు.

# ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

### - సి ఓ ఈ ఏ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు కే సుమన్, రాష్ట్ర కార్యదర్శి ఈదులమూడి మధుబాబు

**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మార్చి 18**

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంట్రాక్టు అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు కే. సుమన్, రాష్ట్ర కార్యదర్శి ఈదులముడి మధుబాబు కోరారు. ప్రకాశం జిల్లా ఒంగోలు లో మంగళవారం వారు జిల్లా కమిటీ తో సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొప్పరాజు చిన రాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమన్, మధుబాబు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీస్ అయినప్పటికీ రాష్ట్రంలో మెప్మా ,సెర్ఫ్ లలో పనిచేసే ఉద్యోగులకు అప్పటి ప్రభుత్వం హెచ్ ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించిందని ప్రస్తుతం అందరూ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కీలక ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్నారని వీరికి భద్రత లేని కారణంగా అనేక ఇక్కట్లు పడుతున్నారని తెలుపుతూ అందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేసి ఉద్యోగ భద్రతతో పాటు, భరోసా కల్పించాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల మంత్రివర్గం సమావేశంలో ఆప్కాస్ రద్దు పై వస్తున్న ప్రకటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం



మరల ప్రైవేటు ఏజెన్సీల దోపిడీకి గురి అయ్యేటట్లుగా ఔట్సోర్సింగ్ ఉద్యోగులను బయటకు నెట్ట వద్దని తెలుపుతూ మెరుగైన విధానాన్ని తీసుకుని వచ్చి ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని, అలాగే ఆప్కాస్ రద్దు పై ఏర్పడిన అణిచితిని ప్రభుత్వం తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా నాయకులు రాఘవరావు, రాయుడు, నాగమల్లెస్వర రావు , ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కె అగ్రహారంలో కిమ్స్ వైద్య శిబిరం





**పొన్నలూరు,పెన్ పవర్ మార్చి 18**

మండలంలోని కె అగ్రహారం గ్రామంలో రామాలయం ఆవరణంలో మంగళవారం ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. గ్రామంలో వివిధ వ్యాధులకు సంబంధించి 121 ఓపీలు వచ్చినట్లు వారు తెలియజేశారు. కంటికి సంబంధించి, ఎముకలు, కీళ్లు నరములు మరియు సాధారణ వ్యాధుల రోగులకు వివిధ పరీక్షలు చేసి అనంతరం వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ రామాంజనేయులు, హైందవి, కిరణ్ కుమార్ అసిస్టెంట్ మేనేజర్ వెంకట నీలాద్రి, సర్పంచ్ చిన్న మస్తాన్, రమణయ్య గ్రామంలో నాయకులు రోగులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

### ట్రాఫిక్ సీఐ పాండురంగరావు

**పెన్ పవర్ - ఒంగోలు క్రైమ్**

మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు




తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ పాండురంగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్ లో 16మంది వాహనదారులను కోర్టు నందు హాజరు పరచగా జరిమానా.. 5 రోజులు శిక్ష విధించడం జరిగిందని తెలిపారు. అందువలన వాహనదారులు తప్ప నిసరిగా యం. వీ. ఐ. యాక్ట్ రూల్స్ పాటించాలని తెలిపారు.

# సిపిఎం ఆధ్వర్యంలో గ్రామాలలో జీపుజాత ప్రచారం

## 20 న ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన కు తరలి రావాలి





**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 18**

వెలుగొండ ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయించి ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన కనిగిరిలోని ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమానికి రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఊసా వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని చెర్లోపల్లి, అరివేముల, ఉప్పలపాడు, నల్లమడుగుల, పుల్లగూరపల్లి, ఆనికాలపల్లి, కోవిలంపాడు, కంభంపాడు, పెదరాజుపాలెం, చింత పూడి, ఆర్కెపల్లి, కే అగ్రహారం, పెద్ద గోగులపల్లి, వెంగనగుంట తదితర పంచాయతీల పరిధిలోని గ్రామాలలో మంగళవారం సిపిఎం పార్టీ జీపుజాతా కార్యక్రమం చేపట్టి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఊసా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టుకు 2 వేల కోట్లు కేటాయించి ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని త్రిబుల్ ఐటీ కాలేజీని పామూరు మండలం దుబగుంట్ల వద్ద నిర్మించాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్యుత్తు ట్రూ ఆఫ్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ కనిగిరి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. మండలం సస్యశ్యామలం కావాలన్నా, వ్యవసాయానికి నీటి కొరత తీరాలన్నా, త్రాగునీటి సమస్య తీరాలన్న వెలుగొండ ప్రాజెక్టును సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాజెక్టు పూర్తి చేయడంలో రాజకీయ నాయకులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రజలు పోరాటాలు, ఆందోళనలు చేస్తే తప్ప ఈ ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదన్నారు. కావున ఈనెల 20వ కనిగిరి ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టే నిరసన కార్యక్రమంలో రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు సన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, అంకేపల్లి వెంకటేశ్వర రెడ్డి, పొదిలి నరసింహులు, జి ఏసుదాసు, బి యేసు రత్నం, పి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# గణిత శాస్త్రము లో గిద్దలూరు వాసి వనజ గోష్టికి డాక్టరేట్..

### అభినందించిన శ్రేయోభిలాషులు..



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 18**

గిద్దలూరు మండలం యన్.బయనపల్లె గ్రామానికి చెందిన వనజ గోష్టి (బోయిల్ల వనజ) గణిత శాస్త్రం లో డాక్టరేట్ పొందారు. గణిత శాస్త్రంలో " ఎఫెక్ట్స్ అఫ్ బౌండరీ స్లిప్ అండ్ వేరిబుల్ ఫిజికల్ ప్రాపర్టీస్ ఆన్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్ఫర్ అఫ్ టూ ఫ్లూయిడ్ ఫ్లోస్ ఇన్ ఎ వర్టికల్ ఛానల్ " అను అంశంలో చేసిన పరిశోధనకు గాను వనజ గోష్టి కి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ లోని సత్యసాయి జిల్లాలో ఉన్న భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్ పట్టాను ప్రధానం చేసింది. హైదరాబాద్ లోని గణిత శాస్త్ర ఆచార్యులు డాక్టర్ జి శ్రీనివాస్, పర్యవేక్షణలో చేసిన పరిశోధనలను గుర్తించి భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ వనజ గోష్టి కి ఈ డాక్టరేట్ పట్టాను ప్రధానం చేసింది . వనజ డాక్టరేట్ పట్టా పొందడం పట్ల ఆమె మామ బోయిళ్ళ నడిపి పోలి రెడ్డి,భర్త చక్రపాణి రెడ్డి, చక్రపాణి మిత్రులు పెండెల కిరణ్ కుమార్, తుమ్మల పెంట సురేష్,దుర్గారావు, సత్యనారాయణ,కంచర్ల రవి, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహా అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు. వనజ ప్రస్తుతం హైదరాబాద్ లోని ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు.

# గిద్దలూరులో బ్లెడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలి

### బీజేపీ నాయకులు



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 18**

భారతీయ జనతా పార్టీ నాయకులు అపి సెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యం లో మార్కాపురం లో నిర్వహిస్తున్న మన ఆపద్బంధు బ్లెడ్ బ్యాంక్ ను సందర్శించడం జరిగింది. ఈ సందర్శన ముఖ్య ఉద్దేశం గిద్దలూరు ప్రాంతము లో ప్రజలు ఆపరేషన్ సమయాల లో బ్లెడ్ అవసరము అయినా అటు నంద్యాల లేక మార్కాపురం వెళ్ళవలసిన వస్తుంది కావున ప్రజల ఇబ్బందుల ను దృష్టి లో ఉంచుకొని గిద్దలూరు లో బ్లెడ్ బ్యాంక్ ఏర్పాటుకు అవసరము అయిన అన్ని అనుమతులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు . ఈ కార్య క్రమం లో భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు బ్లెడ్ డొనేట్ చేశారు. ఈ కార్య క్రమం లో భారతీయ జనతా పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ షఫీ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా భవ నాసి వెంకట రామాంజనేయులు మాట్లాడుతూ గిద్దలూరు పట్టణము లో బ్లెడ్ ఏర్పాటుకు ఏం ఎల్ ఎ అశోక్ రెడ్డి చొరవ తీసుకుని బ్లెడ్ ఏర్పాటుకు చర్యలకు అధికారులకు సూచించాలని కోరారు. అంతే కాకుండా ప్రతి పౌరుడు బ్లెడ్ అవసరమైనప్పుడు రక్త దానం చేయడానికి ముందుకు రావాలని కోరారు.

# నిరుపేద కుటుంబానికి 10,000 ఆర్థిక సహాయం అందించిన అమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ బోనేని.

### గుండె ఆపరేషన్ జరిగి ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న కొమరోలు చెందిన గుర్రం చంద్రబాబు.

### చంద్రబాబు కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని స్పందించిన అమ్మ ఫౌండేషన్.

**కొమరోలు పెన్ పవర్ మార్చి 18.**

గుండె ఆపరేషన్ జరిగి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న గుర్రం చంద్రబాబు కుటుంబానికి అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తమ సభ్యుల సహకారంతో పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కొమరోలు కు చెందిన గుర్రం చంద్రబాబుకు ఇటీవల వైద్యులు గుండె ఆపరేషన్ చేశారు. ఇప్పటివరకు కుటుంబ సభ్యులు అప్పులు చేసి ఐదు లక్షల రూపాయల వరకు చంద్రబాబు ఆరోగ్యానికి ఖర్చుపెట్టారు. చంద్రబాబుకు ఇంకా మెరుగైన వైద్యం చేయించవలసినదని వైద్యులు చెప్పడంతో అందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురై గుర్రం చంద్రబాబు కుటుంబం దిక్కుతో తన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నది. గుర్రం చంద్రబాబు కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, తమ ఫౌండేషన్ సభ్యులతో చర్చించి విరాళాలు సేకరించారు. ఆ మేరకు సమకూరిన పదివేల రూపాయలను మంగళవారం అమ్మ ఫౌండేషన్ వ్యవస్థకు అధ్యక్షులు బోనీని వెంకటేశ్వర్లు యాదవ్, కోశాధికారి సుధాకర్ యాదవ్, సభ్యులు పందనబోయిన భూపాల్ కొమరోలు చెందిన వాసుదేవ రెడ్డి తదితరులు గుర్రం చంద్రబాబు ఇంటికి వెళ్లి చంద్రబాబును పరామర్శించి 10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని తమకు ఆర్థిక సహాయం



అందజేసిన అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ కు, కోశాధికారి సుధాకర్ యాదవ్ తో పాటు కార్యవర్గ సభ్యులకు గుర్రం చంద్రబాబు కుటుంబం ధన్యవాదాలు తెలిపింది.

# ప్రభుత్వ పథకాలలో రైతులు సద్వినియోగపరుచుకోవాలి

### మండల వ్యవసాయాధికారి జైను లాబ్దిన్



**పొదిలి, పెన్ పవర్ మార్చి 18**

ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం పరుచుకోవడం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదగాలని మండల వ్యవసాయాధికారి షేక్ జైను లాబ్దిన్ కోరారు మంగళవారం నాడు మండలంలోని మాదాలవారిపాలెం, ఓబులక్కపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి జైను లాబ్దిన్ ఆయా గ్రామాల్లోని రైతులతో సమావేశం జరిపి, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు అలాగే ఆయా గ్రామాల్లోని రైతులు సాగు చేసిన పంటల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి కూడా రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు ప్రభుత్వ సాయం పొందాలంటే తప్పనిసరిగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొంది ఉండాలని ఆయన చెప్పారు అందువల్ల ఇప్పటివరకు విశిష్ట గుర్తింపు సంఖ్యలు పొందని రైతులు వెంటనే రైతు సేవా కేంద్రానికి వెళ్లి తీసుకోవాలని ఆయన సూచించారు రైతులకు 50 శాతం రాయితీపై ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లు అందిస్తుందన్నారు కావలసిన రైతులు వారి అవసరమైన పత్రాలు తీసుకొని వ్యవసాయ సహాయకుల ను కలవాలని వ్యవసాయాధికారి జైను లాబ్దిన్ కోరారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సమాఖ్య రుణాలను 100 శాతం రికవరీ చేయాలి

### - డిఆర్ డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. నారాయణ



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 18**


మండల సమాఖ్య అకౌంటెంట్ లు తీసుకున్న రుణాలను 100 శాతం రికవరీ చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి. నారాయణ కోరారు. స్థానిక టిటిడిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన లీగల్ కో ఆర్డినేటర్ లు, అకౌంటెంట్ లు సిబ్బంది ని మండలాలు వారిగా అన్ని రుణాలు పై సమీక్ష నిర్వహించారు. స్త్రీ నిధి, ఉన్నతి,సి ఐ ఫ్, జీవనోపాధులు, రుణాలను త్వరితగతిన రికవరీ చేయించి జిల్లా ను ముందుంజలో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య అకౌంటెంట్ లు, క్లస్టర్ లీగల్ కోఆర్డినేటర్ లు, జిల్లా లీగల్ కోఆర్డినేటర్ బెజ్జం రమేష్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చిరుతోటి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

# భూమి మీదకు సునీత విలియమ్స్ రాక

### భావి వ్యోమగాములకు, ఎంచుకున్న రంగంలో కీర్తి శిఖరాలను అధిరోహించాలనుకునే యువతకు సునీత విలియమ్స్ స్ఫూర్తి ప్రదాత...

### జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి స్వరూప రెడ్డి.





**గిద్దలూరు పెన్ పవర్ మార్చ్ 18**

నాలుగు రోజులు ఇంటికి దూరంగా ఉంటేనే చాలామందికి బెంగ వచ్చేస్తుంది. పరిచయంలేని పరిసరాల్లో కొన్నాళ్లపాటు గడపాల్సి వస్తే మనసంతా వికలమై తెలియని ఒంటరితనంతో కూరుకుపోవడం మామూలే. అలాంటిది 8 రోజుల యాత్ర కోసమని అంతరిక్షానికి వెళ్లిన తరువాత తిరిగి రావడానికి వీలు లేని పరిస్థితులలో నెలల తరబడి అక్కడే గడపాల్సి వస్తే ఆ ఒత్తిడి ఎలా ఉంటుందో, అందులోనూ వచ్చే సెప్టెంబర్ 19 వ తేదీన 60వ పుట్టినరోజు జరుపుకోబోతున్న సునీత విలియమ్స్. అంత పెద్ద వయసులో ఇంతటి విపత్కర పరిస్థితిని ఎదుర్కోవాల్సి రావడం ఎంత దుర్భరము అని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. సోమవారం జనవిజ్ఞా వేదికలో జరిగిన ఇష్టాగోష్ఠిలో స్వరూప రెడ్డి పాల్గొని మాట్లాడారు. సమస్యలకు వెన్ను చూపని దృఢచిత్తం, భవిత పట్ల సానుకూల దృక్పథంతో ఆ పరీక్షల్లో నెగ్గుకొచ్చిన సునీత విలియమ్స్ సుదీర్ఘ నిరీక్షణ అనంతరం మరలి రానున్నారని భారతీయ మూలాలను సగర్వంగా ప్రకటించుకునే సునీతతో పాటు ఇన్నాళ్లుగా ఐఎస్ఎస్ లోనే చిక్కుబడిన మరో వ్యోమగామి బుచ్ విల్ మోర్ సైతం స్పేస్ ఎక్స్ క్యాప్సూల్స్ లో బయలుదేరి భూమిపైకి వస్తున్నారన్నారు. మానవ సంకల్ప శక్తికి ప్రతీకలుగా నిలిచిన వారి తిరుగు ప్రయాణం సురక్షితంగా సాగాలని భారతావనితోపాటు యావత్ ప్రపంచం నిండు మనసుతో ఆకాంక్షిస్తుందని తెలిపారు.

# మండలం లోని నీటి సంఘం అధ్యక్షులకు శిక్షణ

**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 18**

చంద్రశేఖరపురం మండలంలోని 12 చెరువుల ఆయకట్టు నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ఈనెల 19న ఒంగోలులోని ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయంలో ఒకరోజు శిక్షణ ఉంటుందని ఇరిగేషన్ ఏఈ వినయ్ తెలిపారు కావున మండలంలో ని ఇరిగేషన్ చెరువులకు ఎన్నికైన అధ్యక్ష ఉపాధ్యక్షులు హాజరు కావాలని తెలిపారు.

# స్పోర్ట్స్ మీట్ లో పాల్గొన్న చీరాల ఎమ్మెల్యే ఎం ఎం కొండయ్య

**చీరాల,పెన్ పవర్,మార్చ్ 18**

లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ మీట్ 2025 కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య పాల్గొన్నారు. మంగళవారం విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన స్పోర్ట్స్ మీట్లో సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు.



పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

## క్రీఢాంధ్రప్రదేశ్ దిశగా ప్రభుత్వ తొలి అడుగు

**మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు**





**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 18:**

కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధులకోసం మూడురోజులు నిర్వహించనున్న సాంస్కృతిక, క్రీడా పోటీల్లో మాజీమంత్రి శాసనసభ్యులు ప్రత్తిపాటి జట్టు విజయం సాధించింది. విజయవాడలోని డీఆర్ఆర్ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో తొలిరోజైన మంగళవారం సాయంత్రం జరిగిన పోటీల్లో మాజీమంత్రి ప్రత్తిపాటి, మంత్రి టీ.జీ.భరత్ ఒక జట్టుగా, మాజీమంత్రులు వసంత కృష్ణ ప్రసాద్, పితాని సత్యనారాయణ ఒక జట్టుగా బ్యాడ్మింటన్ ఆడారు. ఆద్యంతం సరదాగా సాగిన క్రీడలో చివరకు ప్రత్తిపాటి, భరత్ లు విజయం సాధించారు. ఆట ముగిసిన అనంతరం మాజీమంత్రి ప్రత్తిపాటి మాట్లాడుతూఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం ప్రభుత్వం మూడు రోజులపాటు క్రీడా, సాంస్కృతి పోటీలు నిర్వహించాలనే ఆలోచన చేయడం, పాత సంప్రదాయాన్ని పునరుద్ధరిచండం నిజంగా మంచి విషయమన్నారు. సభాపతి అయ్యన్నపాత్రుడి ఆలోచనను స్వాగతిస్తున్నామన్నారు. సభ్యులందరూ తప్పకుండా పోటీల్లో పాల్గొని తమజీవితాల్లో కొన్ని మధుర జ్ఞాపకాలుగా ఈ క్షణాలను పదిలపరుచుకోవాలని ప్రత్తిపాటి సూచించారు.

## అన్నా క్యాంటీన్ లు మరింత సమర్థవంతంగా నిర్వహణ : కమిషనర్ పీ.శ్రీ హరిబాబు

**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 18:**

చిలకలూరిపేట పట్టణంలోఅన్నా క్యాంటీన్లు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు మరింత కృషి చేయాలని సూచించామని చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు అన్నారు.మంగళవారం పట్టణంలో అన్నా క్యాంటీన్లను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఎన్.ఆర్.టి. సెంటర్, పురుషోత్తమ పట్నం, గడియారం స్తంభం వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ లను పరిశీలించి అక్కడ నెలకొన్న పరిస్థితులను గమనించారు. ముఖ్యంగా ఆహారం శుచిగా ఉందా లేదా అన్న విషయమై ఆహారం స్వీకరిస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు. అయితే సుచిగా, వేడిగా, రుచికరమైన ఆహారం లభిస్తుందని వారు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.అక్కడే అల్పాహారం తీసుకున్న కమిషనర్ , ఆ తర్వాత ఆర్వో వాటర్ ప్లాంట్ ను పరిశీలించారు. అన్నా క్యాంటీన్ల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మక అన్నా క్యాంటీన్లు నిర్వహిస్తున్న తరుణంలో ఆకస్మిక తనిఖీలను కూడా అప్పుడప్పుడు చేపడుతుంటామన్నారు. ఇందులో భాగంగా ఈరోజు పట్టణంలో ఉన్న మూడు అన్నా క్యాంటీన్ల ను పరిశీలించామని తెలిపారు. అన్నీ సంతృప్తిగా ఉన్నాయని వెల్లడించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పౌష్టికాహారం, వేడివేడి ఆహార పదార్థాలను అందించడం జరుగుతుందన్నారు.



# ఫార్మా రంగంలో కెమిస్ట్రీ సబ్జెక్టుకు అత్యున్నత అవకాశాలు

## రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు - ఏ.కే.యూలో విజయవంతమైన అతిథి ఉపన్యాసం

**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం మార్చి 18:**

గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో కెమిస్ట్రీ విభాగం నందు ప్రతిభా, పాటవాలు కలిగిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఎంతగానో ఉందని ఆంధ్ర కేసరి యూనివర్శిటీ రిజిస్ట్రార్, కెమిస్ట్రీ డిపార్టుమెంటు హెడ్ ప్రొఫెసర్ బి హరిబాబు అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్శిటీ సమావేశపు హాలులో జరిగిన అతిథి ఉపన్యాస కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఏ.కే.యూ కెమిస్ట్రీ డిపార్ట్మెంటు ఆధ్వర్యంలో "కెరీర్ ఆపర్చునిటీస్ ఫర్ ఆర్గానిక్ కెమిస్ట్స ఇన్ ఫార్మా" అనే అంశం మీద అతిథి ఉపన్యాస కార్యక్రమము నిర్వహించ బడింది. ఈ కార్యక్రమంలో అతిథి ఉపన్యాసకులుగా స్క్రిప్ట్స్ ఫార్మా వైస్ చైర్మన్ డాక్టర్ వరాల రవి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ ఫార్మా రంగం నేడు ఎంతగానో విస్తరిస్తోందని అన్నారు. ఫార్మా రంగానికి కెమిస్ట్రీ విభాగం అనుబంధ రంగంగా ఉంటుందని అందువల్లనే కెమిస్ట్రీ విభాగంలో మంచి ప్రావీణ్యం కలిగిన విద్యార్థులకు ఫార్మా రంగంలో అన్ని విధాలా శ్రేయస్కరంగా ఉంటుందని, మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా మందుల తయారీ విభాగంలో కెమిస్ట్రీ విద్యార్థులకు అత్యుత్తమ అవకాశాలు లాభిస్తున్నాయని, అందివస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగ పరచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి




రాజమోహన్ రావు, కెమిస్ట్రీ సహాయ ఆచార్యులు డాక్టర్ ఉబ్బా ఈతముక్కల, జాస్మిన్, ఆంధ్ర కేసరి యూనివర్శిటీ కెమిస్ట్రీ విభాగానికి చెందిన పలువురు స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం అతిథి ఉపన్యాసకులు డాక్టర్ వరాల రవిని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హరిబాబు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజ మోహన్ రావుల ఆద్వర్యంలో ఘనంగా సన్మానించారు.



# అభివృద్ధి.. సంక్షేమం.. సామాజిక న్యాయ సారధి చంద్రబాబు

### *శాసనసభ మహాప్రస్థానానికి 47 ఏళ్లు.*

### *యారవ శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీ నాయకులు*



**పామూరు, పెన్ పవర్, మార్చి18**

శాసనసభ్యునిగా మొదటి ప్రమాణ స్వీకారం 15 మార్చ1978న మొదటిసారిగా ఎమ్మెల్యేగా చంద్రబాబు శాసనసభలో ప్రమాణస్వీకారం చేసి 47 ఏళ్లు పూర్తయ్యాయని తెలుగుదేశం పార్టీ నాయకులు యారవ శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా యారవ శ్రీనివాసులు పెన్ పవర్ తో మాట్లాడుతూ సైబరాబాద్, ప్రజా రాజధాని అమరావతి, పోలవరం సృష్టికర్త, అభివృద్ధి ప్రధాత ఉమ్మడి ఏపీలోని 23 జిల్లాల యువత 30 లక్షల మందికి సైబరాబాద్ ఉద్యోగాలు, ఉపాధి కల్పించింది. ఐటీ విప్లవం తెచ్చి తెలుగుబిడ్డల్ని100కు పైగా దేశాలలో పెద్ద ఉద్యోగస్తుల్ని చేశారని ఆయన తెలిపారు. విద్యుత్ వెలుగులు నింపిన నేత : రాష్ట్రంలో 18 మంది సీయం లు స్థాపించిన విద్యుత్ స్థాపిత సామర్థ్యం సుమారు 5 వేల మెగావాట్లు చంద్రన్న ఒక్కరే 15 వేల మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ ప్లాంట్లు స్థాపించారు. ఇవే లేకపోతే కరెంటు కోతలు వుండేవి. పారిశ్రామిక ప్రగతి వుండేది కాదు. వ్యవసాయ మోటార్లకు ఉచిత విద్యుత్ ఉండేది కాదు. బీసీ వృత్తులు, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఉండేది కాదు. ఆక్వా రైతులకు రూ.1.50కే విద్యుత్ ఉండేది కాదని ఆయన అన్నారు. సమైక్య రాష్ట్రంలో 51 వేల కి.మీ., నవ్యాంధ్రలో ఇప్పటికి 35 వేల కి.మీ. రోడ్లు నిర్మించారు. నెల్లూరు%తత%చెన్నై జాతీయ రహదారి నిర్మాణానికి బీజం వేసి నేటి జాతీయ రహదారుల నిర్మాణాలకు ప్రేరణ ఇచ్చారని అన్నారు. పోలవరం.. పట్టిసీమ.. బనకచర్ల.. నదుల అనుసంధానం. నాడు ఎన్టిఆర్ తెలుగుగంగ ద్వారా కృష్ణా%తత%పెన్నా అనుసంధానం చేశారు. నేడు చంద్రన్న పట్టిసీమ ద్వారా గోదావరి, కృష్ణా అనుసంధానం చేశారు. అలాగే పురుషోత్తమపట్నం ద్వారా వంశధార, నాగావళి అనుసంధానానికి కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. సైబరాబాద్లో 30 లక్షల ఉద్యోగాలు, ఉపాధి కల్పించారు. 2014%తత%19 మధ్య రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి 5.13 లక్షల ఉద్యోగాలు కల్పించారు.1.80 లక్షల ఉపాధ్యాయ నియామకాలు చేశారు. నేడు 16,347 ఉద్యోగాలతో డీయస్సీ, నేడు రూ.6.5 లక్షల కోట్లు పెట్టుబడులు ఆకర్షించి 4 లక్షల ఉద్యోగ కల్పనకు కృషి జరుగుతున్నదని యారవ శ్రీనివాసులు అన్నారు.

# ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

## - జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ ఆదేశం



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 18**

ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియ జిల్లాలో పటిష్టంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ చాంబర్ లో ఆధార్ కార్డుల నమోదు, నవీకరణ ప్రక్రియపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఆధార్ కార్డుల నవీకరణ పెండింగ్ ప్రక్రియపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు, వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీ ఎస్ జీఎస్ డబ్ల్యూ, పోస్టల్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాలన్నీ పని చేయాలన్నారు. కొత్తగా జన్మించిన శిశువుల ఆధార్ ఎన్ రోల్ మెంట్ కు సంబంధించి బర్త్ రిజిస్ట్రేషన్ బేస్డ్ ఆధార్ ఎన్రో ల్మంట్ అనే విధానాన్ని అవలంభించాలన్నారు. నవీకరణ ప్రక్రియపై ప్రజలకు తక్షణమే అవగాహన కల్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రి లేదా ఏ ఆసుపత్రిలో శిశు జన్మించినప్పటికీ తక్షణమే ఆ శిశువు ఆధార్ నమోదు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అపార్ ఐడి నమోదులో పెండింగ్ ఉండరాదని ఆదేశించారు. ఆధార్ కార్డుల నవీకరణ ప్రక్రియపై క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ నవీకరణ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఈ ఓ చిరంజీవి, ఐసిడిఎస్ పిడి హేన సుజన, ఉదయ్ సంస్థ ప్రతినిధులు, ఆధార్ జిల్లా కోఆర్డినేటర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి విస్తరణ లో భూములు కోల్పోతున్న రావిపాడు గ్రామ రైతులకు నష్టపరిహారం పై పల్నాడు జిల్లా జే. సి సూరజ్ ధనుంజయ్ గనోరే సమావేశం




**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 18:**

నరసరావుపేట.జాతీయ రహదారి విస్తరణ లో భూములు కోల్పోతున్న రావిపాడు గ్రామ రైతులకు నష్ట పరిహారం పై పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే మంగళవారం ఉదయం నరసరావు పేట ఆర్డిఓ కార్యాలయం లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సమావేశాన్ని నరసరావు పేట ఆర్డిఓ మధులత, జాతీయ రహదారి విస్తరణ అధికారులు, నరసరావు పేట మండలం,రావిపాడు గ్రామ జాతీయ రహదారి విస్తరణ లో భూములు కోల్పోయిన రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, జాతీయ రహదారి విస్తరణ అధికారులు, నరసరావుపేట ఆర్డిఓ మధులత, తహశీల్దార్ వేణు గోపాలరావు. నరసరావుపేట మండల సర్వేయర్ లు మాట్లాడారు. అనంతరం భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ఇప్పించబడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఆర్డీవో మధులత, కార్యాలయ ఏవో,నరసరావు పేట తహశీల్దార్ వేణు గోపాలరావు సిబ్బంది,రావిపాడు గ్రామానికి చెందిన జాతీయ రహదారికి భూములు ఇచ్చిన రైతులు పాల్గొన్నారు.

## పిచ్చమ్మ మృతదేహానికి నివాళులు అర్పించిన కరణం





**చీరాల,పెన్ పవర్,మార్చ్ 18**

రాజ్యసభ సభ్యులు, మాజీ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి యర్రం పిచ్చమ్మ కి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన చీరాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు .ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు గవని శ్రీనివాసరావు , చీరాల నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు సాదు రాఘవ , బాపట్ల జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, చీరాల నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్ కుమార్ చౌదరి జన్మదిన వేడుకలు

**కావలి పెన్ పవర్- మార్చి18**

తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో తెలుగు తమ్ముళు పెద్ద ఎత్తున పాల్గొని రాజ్ కుమార్ చౌదరి కి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సత్కరించి బొకేలను అందజేశారు. భారీ కేకు ను కట్ చేయించి అందరికీ పంచి పెట్టారు. తెలుగు తమ్ముళ్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు తన పై చూపిన అభిమానానికి రాజ్ కుమార్ చౌదరి ధన్యవాదములు తెలిపారు.



పెన్ పవర్
నెల్లూరు । తిరుపతి । చిత్తూరు




# ప్రభుత్వానికి కావాల్సింది ధనమే...




ప్రజలు మహిళలు ఎవరు ఎటు పోయినా పర్వాలేదు....

ఇది ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

స్థానిక బిజిలి బజార్ కూడలి సెంటర్లో వెలసిన వైన్ షాప్...

దుమ్మెత్తి పోస్తున్నప్రజలు... విపక్షాలు.

**కావలి పెన్ పవర్ మార్చి 18:**

2019లో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం తను చేస్తున్న పరిపాలన ప్రజలకు నచ్చకపోవడంతో దౌర్జన్యాలు, హింసలు, కక్షపూరితమైన మరియు ఉద్దేశపూర్వకమైన కేసులతో విచ్చలవిడిగా మద్యం అనే అంశాలతో అలాగే ఉద్యోగులపై చేస్తున్న కక్షపూరితమైన విషయాలలో గత ప్రభుత్వాన్ని ఓడించి నూతనంగా ఎన్డీఏ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చిన విషయం ప్రజలందరికీ తెలిసినదే. అయితే ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యముగా మహిళలను రక్షణ కల్పించాలి,అలాగే ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని అనేకమైన సంక్షేమ పథకాల ఆశ చూపించి ఎన్డీఏ ప్రభుత్వం గద్దినెక్కడం విశేషం. అయితే నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అమలు చేయక పోయినప్పటికీ ప్రభుత్వం చేస్తున్న నిరంకుశత్వంను ప్రజలు పెద్దవివరుస్తున్నారు. గత ప్రభుత్వమే మేలు అనే అంశం ప్రజల్లో బాగా నాటుకుపోయినది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ప్రజల లో వ్యతిరేకత మొదలవడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని నడిపేందుకు ప్రధాన ఆదాయ వనరులు మద్యం మద్యం లో టెండర్ దారుల వలన రాష్ట్ర ప్రభుత్వానికి కొన్ని వందల కోట్ల రూపాయలు ఆదాయం వచ్చింది. అయితే ఇష్టం వచ్చినట్లు వైన్ షాపులు ఇవ్వడం ఎక్కడపడితే అక్కడ వైన్ షాపులు వెలవడం అక్కడ తాగుబోతులు తాగి తమ విశ్వరూపాన్ని ప్రదర్శించడం మహిళలు, ప్రజలు ఉద్యోగస్తులు లేదు ఎవరు మీద అయినా తాగిన వారు అసభ్యకరంగా ప్రవర్తిస్తూ... అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందని, అలాగే కావలి పట్టణంలో కొత్తగా అంజిస్ సెంటర్లో వెలసియున్న వైన్ షాప్ అక్కడి పేద ప్రజల కడుపు కాల్చి ఎన్నో సంవత్సరాలుగా తోపుడు బండ్లు లో అరటికాయలు, పండ్లు పెట్టుకొని జీవనం సాగిస్తున్న వారిని సైతం అధికార బలంతో లేపించి వైన్ షాప్ వేలవడం కావలి పట్టణ ప్రజల్లో ఒక్కసారి ఆశ్చర్యానికి గురయ్యారు. ఏప్రభుత్వ అధికారి కూడా పట్టించుకోకపోవడం ఏమిటి అని పట్టణ ప్రజల్లో మిలియన్ డార్ల ప్రశ్న..,... నిరంతరం అధిక జనాభా తిరిగే ప్రదేశం ఐనా ఆర్టీసీ బస్టాండ్ లో వైన్ షాపులు పై కావలి ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క కావలి నియోజక వర్గ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి నన్ను గెలిపించిన నా ప్రజలను కాపు కాస్తాను... అని వక చెప్తుంటే మరి అధికారులు ఈ విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నారు. అధికారులకు వైన్ షాప్ వారికి ఉన్న లావాదేవులే దీనికి కారణమా.... లేక అధికారులు వీరిలో భాగస్వాములయ్యారా.... ఈ ప్రభుత్వం ఎందుకు ఇలా మహిళలను, ప్రజలను, ఉద్యోగస్తులను, వ్యాపారస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రతి ఒక్కరుకావలి పట్టణ లో ఈ విషయం ఎక్కడ చూసినా చర్చించుకోవడం విశేషం..... ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇ క్కడ ఉన్నవైనుషాప్ ను మార్చేందుకు సహకరించాలని, ఇటువంటివి మరల పునరావృతం కాకూడదని ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఉండాలే కానీ వ్యతిరేకత ఉండకూడదని కావలి పట్టణ ప్రజలు, ప్రజా సంఘాలు, విపక్షాలు కోరుతున్నాయి.

# జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సభను విజయవంతం చేసిన అందరికీ ధన్యవాదాలు తేలపోలు రమేష్



**జలదంకి పెన్ పవర్ -మార్చి 18:**

జలదంకి మండల కేంద్రంలో సోమవారం జనసేన పార్టీ నాయకులు వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు తేలపోలు రమేష్ మాట్లాడుతూ మార్చి 14వ తేదీ పిఠాపురంలో జరిగిన జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవంనకు ఉదయగిరి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో వెళ్లి విజయవంతం చేసిన జనసేనకులకు, వీర మహిళలకు నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఇంచార్జ్ అజయ్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు భోగినేని కాశీ తరపున తేలపోలు రమేష్ ధన్యవాదాలు తెలిపారు. ఆవిర్భావ దినోత్సవంనకు ఒక నెల ముందు నుంచీ పక్క ప్రణాళిక తో సభకు విచ్చేసిన అందరికీ భోజన, వసతి సదుపాయం, ఎలాంటి అవాంచనీయ సంఘటనలకు జరగకుండా జిల్లా ఇంచార్జ్ వేములపాటి అజయ్ కుమార్ కి అందరి తరపున కృతజ్ఞతలు తెలిపారు. దాదాపుగా నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గం మొత్తం 40 బస్సుల్లో దాదాపు రెండు వేల నుంచి 2500 మంది వరకు పాల్గొనటం జరిగింది అని తెలిపారు. రాబోయే కాలంలో అందరు పార్టీ ఏమి ఆదేశించిన అది చేయటానికి తూచా తప్పకుండా పాటించి ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషి చేసి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. పార్టీ ఆదేశించిన ఏ పనైనా ఉదయగిరి నియోజకవర్గం నుండి ముందుగా మొదలు పెట్టాలని ఆయన కోరారు. అధికారం లేకుండా దాదాపు 12 సంవత్సరాలు ఒక పార్టీని నడపడం చాలా కష్టతరమైనది. అలాంటిది డిప్యూటీ సీఎం అధ్యక్షులు కళ్యాణ్ దాన్ని సుసాధ్యం చేశారు అని తెలిపారు. ఇప్పుడు మనందరం పార్టీపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ప్రజా సంక్షేమం మీద దృష్టి పెట్టీ, వీలైనంతవరకు ప్రజలకి మంచి చేసే విధంగా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాలని అధినాయకుడు పవన్ కళ్యాణ్ ఆదేశించారు అని తెలిపారు. దానికి అనుగుణంగా ఉదయగిరి లో మా వంతు మేము కృషి చేస్తాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జలదంకి మండల నాయకులు తేలపోల రమేష్, ఉదయగిరి నియోజకవర్గ కమిటీ మెంబర్ గుండా బత్తిన రామ్మూర్తి, జనసేన నాయకులు ముళ్ళమూరి కృష్ణారావు, శెట్టిపల్లి మధు, మండల యువత అధ్యక్షులు కొల్లు అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఊటుకూరు గ్రామంలో భూ కొనుగోలు పథకంలో అక్రమాలను వెలికి తీయాలి

## లేని యెడల ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తాం.

## దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి డిమాండ్.

**కావలి పెన్ పవర్- మార్చి 18**

విడవలూరు మండలం ఊటుకూరు గ్రామంలో భూ కొనుగోలు పథకం ద్వారా కొనుగోలు చేసిన 90 ఎకరాల భూ అక్రమాలను వెలికి తీసి ఎస్సీలకు అప్పజెప్పాలని లేనియెడల శనివారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ విషయం తీసుకెళ్తామని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి అధికారులను హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని స్థానిక జర్నలిస్ట్ క్లబ్ నందు ఆయన బాధితులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ విడవలూరు మండలంలోని ఊటుకూరు దళితవాడ కాపురస్తులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2018 సంవత్సరంలో సర్వేనెంబర్ 1288, 1294 మొత్తం 90 ఎకరాల 86 సెంట్లు భూమిని 91 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇవ్వటం జరిగిందన్నారు. కొనుగోలు చేసిన ఆ భూమిని అల్లూరు సబ్ రిజిస్టర్ ఆఫీసులో కూడా రిజిస్ట్రేషన్ చేసుకుని ఏడు కోట్ల 49 లక్షల 50వేల 500 రూపాయలు రైతులకు కూడా చెల్లించిచారని తెలిపారు .కానీ అప్పటినుంచి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సర్వే చేసి ఆ భూములను దళితులకు చూపించలేదని తెలిపారు. రైతుల దగ్గర నుంచి భూములు కొనుగోలు చేసినా తిరిగి ఆ రైతులే సాగు చేసుకుంటున్న పరిస్థితి అక్కడ ఉందన్నారు .కానీ రెవెన్యూ అధికారులు చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా రైతులతో కుమ్మక్కై ఎస్సీల కోసం కొనుగోలు చేసిన భూములను ఇప్పటివరకు చూపించలేదని తెలిపారు. అయితే ఎస్సీ కార్పొరేషన్ వారు లబ్ధిదారులకు ఇచ్చిన భూములు తాలూకా డబ్బులు కట్టమని ఒత్తిడి తీస్తున్నారని అటు డబ్బులు కట్టలేక, ఇటు భూములు స్వాధీనం చేసుకోలేక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా సదరు భూమిని సర్వే చేసి ఎస్సీలకు పంచి పెట్టాలని లేనియెడల ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి నాయకులు రెబ్బా పాపారావు, అద్దంకి కార్తీక్ ,జరుగుమల్లి విజయరత్నం, జడ్డా వాసు తదితరులు పాల్గొన్నారు.



# జీవనజ్యోతి వెల్ నెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఊబకాయం, అధిక బరువుపై అవగాహన



**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 18:**

మారుతున్న జీవనశైలిలో అధిక బరువు, ఊబకాయంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జీవనజ్యోతి వెల్ నెస్ క్లబ్ సభ్యులు జీవన్ అన్నారు. మండల కేంద్రమైన గుడ్లూరులోని బస్టాండ్ ఆవరణలో మంగళవారం అధిక బరువుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ మాట్లాడుతూ నేటి సమాజంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా ఎక్కువమంది ఊపకాయంతో ఇబ్బందులు పడుతున్నారని తద్వారా అనేక రకమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటూ, శారీరక శ్రమ చేయడం ద్వారా భవిష్యత్తులో ఎటువంటి ఆరోగ్య సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. సాక్షాత్తు భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల అధిక బరువు ఊబకాయంపై ప్రజల్లో అవగాహన పంచాలని పిలుపునివ్వటం మంచి శుభ పరిణామం అని అన్నారు. అధిక బరువు, ఊబకాయం, ఇతర సమస్యలతో బాధపడేవారు మరిన్ని వివరాలకు 8096463704, 9618891644 ఫోన్ నెంబర్ల లో సంప్రదించి తగిన వివరాలు పొందవచ్చు అన్నారు.

# యర్రం పిచ్చమ్మ పార్థివ దేహానికి నివాళులు అర్పించిన ఇంచార్జి దద్దాల,. గంగాసాని



**పామూరు, పెన్ పవర్, మార్చి18**

వైసీపీ సీనియర్ నాయకులు, రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి మాతృమూర్తి యర్రం పిచ్చమ్మ మరణించిన విషయం తెలుసుకొని వైసీపీ నాయకులతో కలిసి కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్, పామూరు మండల అధ్యక్షుడు గంగాసాని హుస్సేన్ రెడ్డి ఒంగోలులో ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులుఅర్పించారు. ఈ సందర్భంగా ఆమె మృతికి సంతాపం తెలిపారు అనంతరం కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, జంకె వెంకట రెడ్డి, ఉడుముల శ్రీనివాసుల రెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాసులు, ఆదిమూలపు సురేష్, కుందురు నాగార్జునరెడ్డి, కాకుమాను రాజశేఖర్ మరియు కనిగిరి నియోజకవర్గం నాయకులు పిడిసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ గాయం సావిత్రి,జడ్పీటీసీలు గుంటక తిరుపతి రెడ్డి, మడతల కస్తూరి రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, గాయం బలరామిరెడ్డి, గాయం ఈశ్వరమ్మ, గట్లా విజయభాస్కర్ రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, సైకం ఏడుకొండలు రెడ్డి,కటికల వెంకటరత్నం, వాక మళ్ల రాజశేఖర్,శ్రీరామ్ శ్రీనివాస్,పల్నాటి భాస్కర్ రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి,ఆవుల భాస్కర్ రెడ్డి, ఈర్ల శ్రీను, కంటూ కేశవ, ఎలిక అచ్చయ్య, గోడి నారాయణరెడ్డి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

# వడదెబ్బతో వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

**డాక్టర్ ముప్పళ్ళ ప్రవీణ**

**పామూరు, పెన్ పవర్, మార్చి18**

రోజు రోజుకు వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ముప్పళ్ళ ప్రవీణ. ప్రజలకు మంగళవారం సూచించారు. ఎండ తీవ్రత వడగాల్పులు సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎండ తీవ్రత గురించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ ఎండ తీవ్రత వల్ల అప్రమతంగా ఉంటూ నెత్తికిటోపీ లేదా రుమాలు కట్టుకొని, కాటన్ వస్త్రాలు ధరించాలని ఆమె సూచించారు.



# ప్రశాంతంగా పదవ తరగతి తెలుగు పేపర్ పరీక్ష

రెండు పరీక్ష కేంద్రాలలో తెలుగు పరీక్షకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన స్క్వాడ్ అధికారి ,మద్దిపాడు ఎంఈఓ శ్రీనివాసరావు.

పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన స్క్వాడ్ అధికారి.

పరీక్ష కేంద్రాల వెలుపల గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించిన గిద్దలూరు సిఐ రామకోటయ్య , కొమరోలు ఎస్సై నాగరాజు





**కొమరోలు పెన్ పవర్ మార్చి 17:**

కొమరోలు లో ఏర్పాటుచేసిన మూడు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రాలలో సోమవారం నిర్వహించిన తెలుగు పేపర్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. తెలుగు పేపర్ పరీక్షకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రాల నిర్వహకులు తెలిపారు. కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి 175 మంది విద్యార్థులను కేటాయించగా, తెలుగు పేపర్ పరీక్షకు సోమవారం 173 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, వారిలో 172 మంది విద్యార్థులు హాజరయ్యారు . నరేష్ రెడ్డి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి వంద మంది విద్యార్థులను కేటాయించగా వారిలో తెలుగు పరీక్ష పేపర్ కు ఒక విద్యార్థి గైర్హాజరై 99 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని అన్నారు. సర్వైట్ హైస్కూలు లో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రానికి 175 మంది విద్యార్థులను కేటాయించగా తెలుగు పరీక్షకు 170 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా మొత్తం విద్యార్థులందరూ హాజరై తెలుగు పరీక్ష పేపర్ రాశారని ఆ పరీక్షా కేంద్ర చీఫ్ సూపరిండెంట్ షేక్ అహ్మద్ తెలిపారు. సోమవారం నిర్వహించిన తెలుగు ప్రశ్న పత్రం పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని అధికారులు తెలిపారు.కాగా కొమరోలు లోని మూడు పరీక్ష కేంద్రాలను సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి మద్దిపాడు ఎంఈఓ శ్రీనివాసరావు ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు .పరీక్షలు ప్రశాంత సజావుగా జరుగుతున్నట్లుగా ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల లోపల, వెలుపల ప్రశాంత వాతావరణం కనిపించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా కొమరోలు ఎంఈఓ 2 బొర్ర వెంకటరత్నం సోమవారం తెలుగు ప్రశ్నపత్రం పరీక్ష సందర్భంగా కొమరోలు లోని మూడు పరీక్ష కేంద్రాలను పలుమార్లు సందర్శించి పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు .పరీక్షా కేంద్రాల వెలుపల గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లుగా గిద్దలూరు సీఐ రామకోటయ్య ,కొమరోలు ఎస్సై నాగరాజు తెలిపారు .ఒక్కొక్క పరీక్షా కేంద్రం వద్ద ఇద్దరు కానిస్టేబుళ్లను, మరో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లను నియమించడంతోపాటు పరీక్ష ప్రారంభం నుండి ముగిసేంతవరకు ఎస్సై నాగరాజు ,ఏఎస్ఐ పవన్ కుమార్ పర్యవేక్షించారని సీఐ తెలిపారు.

## అసైన్ మెంట్, డీ పట్టా కలిగిన రైతులకు కూడా

# ప్రత్యేక గుర్తింపు సంఖ్యకు అవకాశం

### గుడ్లూరు-2, గుండ్లపాలెంలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**గుడ్లూరు, పెన్ పవర్, మార్చి 18:**

మండల కేంద్రమైన గుడ్లూరు-2 మరియు గుండ్లపాలెం రైతు సేవా కేంద్రాలలో మండల వ్యవసాయ అధికారి బి.రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వ్యవసాయశాఖ మరియు అనుబంధ రంగాలు పొలం పిలుస్తోంది వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణ కార్యక్రమం అని ఏవో అన్నారు. ఈ కార్యక్రమములో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఇప్పటివరకు సొంత భూములు ఉన్నా ఫార్మర్స్ మాత్రమే రైతు ప్రత్యేక గుర్తింపు సంఖ్యకు అవకాశం ఉన్నదని, కానీ ప్రస్తుతం అసైన్ మెంట్, డీ పట్టా కలిగిన రైతులకు కూడా అవకాశం ఇవ్వబడినది కావున అందరు త్వరితగతిన ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయించుకోని. పీఎం కిసాన్ పథకానికి ఇప్పటివరకు అర్హులు, అమౌంట్ పడుతున్న వారు తప్పనిసరిగా గ్రామ వ్యవసాయ లేదా ఉద్యాన సహాయకులను సంప్రదించి ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయించుకొని ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందవలయును లేని పక్షంలో తదుపరి ఇన్ స్టాల్మెంట్ అమౌంట్ జమకాదు అని గమనించగలరు అని తెలియజేశారు. ఈ కార్యక్రమములో గ్రామ నాయకులు, మరియు రైతులు పాల్గొన్నారు.



## కటకాని పల్లె రామచంద్ర కోట గ్రామాలలో పొలం పిలుస్తోంది



**పెద్ద దోర్నాల పెన్ పవర్ మార్చి 18**

మండలం లోని కటకానిపల్లి మరియు రామచంద్ర కోట గ్రామాలలో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ మాట్లాడుతూ గ్రామం లో సాగు చేసిన పొగాకు, మరియు జమ, మిరప పంటలను సందర్శించడం జరిగింది. అలాగే వ్యవసాయ శాఖ ద్వారా అమలు అవుతున్న వ్యవసాయ యంత్రికరణ పథకం, ఏపీ ఎఫ్ ఆర్ ఈ పంట నమోదు పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో విహెచ్ఎ శ్వేత, ఏపీ సీఎం ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



# ముఖ్య మంత్రికి బేడ జంగం సంఘం నేతల కృతజ్ఞతలు






**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మార్చి 18**

కూటమి ప్రభుత్వం బేడ జంగాలకు ఎస్సీ వర్గీకరణ నిమిత్తం కులాలను విభజించే ప్రక్రియలో భాగంగా గత కొన్ని సంవత్సరాల నుంచి బేడ జంగం సభ్యులు పడుతున్న ఇబ్బందులను కూడా పరిగణలోకి తీసుకొని వారిని రెల్లి ఉప కులాలుగా బెడజంగాలు చేర్చడం, అలాగే 20వ తారీఖున అది నేషనల్ ఎస్సీ కమిషన్ పంపించడం జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం పట్ల బేడ జంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉద్దండి మల్లికార్జున రావు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంసీఏ భవనంలో బేడ జంగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉద్దండి మల్లికార్జునరావు పత్రిక సమావేశం నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా బేడజంగంలో చదువుకున్న విద్యార్థులకు కుల సర్టిఫికెట్ లేక ప్రభుత్వ తరపున వచ్చే అనేక పథకాలను విద్యార్థులకు చేకూరే అనేక వసతులను లేక చాలా ఇబ్బందులు పడటాన్ని రంగరాజు మిశ్రా ఏక సభ్య కమిషన్ ముందు మా సమస్యలు చెప్పుకోవటంతో వాటిని పరిగణలోకి తీసుకొని కుల వర్గీకరణలో ఎస్సీ లలో చేర్చటం మాకు ఎంతో మేలు చేసిన వారయ్యారని ప్రభుత్వాన్ని కొనియాడారు. ముందుగా బిఆర్ అంబేద్కర్, నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఏక సభ్య కమిషన్ చైర్మన్ అలాగే ఎన్నో సంవత్సరాల నుంచి బేడ జంగం కులానికి అహర్నిశలు కష్టపడిన రాష్ట్ర అధ్యక్షుడు దూపం సత్యం చిత్ర పటాలకు కి పాలాభిషేకం చేశారు. ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ఎనగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళ పోరాట ఫలితం మాకు దక్కిందని మమ్మల్ని గుర్తించిన ఈ ప్రభుత్వం కి మేము ఎన్నడూ విశ్వాసంగా ఉంటామని రాబోయే కాలాల్లో మా కులానికి ఎలాంటి ఇబ్బందులు వచ్చినా భరోసాగా ఉంటుందని ఈ ప్రభుత్వం మీద మాకు నమ్మకం ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెక్రెటరీ మరిపూడి భద్రయ్య, జిల్లా సెక్రెటరీ ఈయనగంటి ఆనందరావు, నాటకం శంకర్ రావు, తోట మల్లికార్జునరావు, కాకుమాను రవి, పడగల చిరంజీవి, బూదూరి కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# ర్యాలి గ్రామంలో పర్యటించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు అడబాల





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 18:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండల బిజెపి మండల యు. వెంకటేశ్వరరావు స్వగ్రామమైన ర్యాలి లో మంగళవారం జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, మాజీ శాసనసభ్యులు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిని మండల అధ్యక్షులు యు .వెంకటేశ్వరరావు, మండల నాయకులు, కార్యకర్తలు దుస్సాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ సూచనలతో, రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాలతో జిల్లాలో నూతనంగా మండల అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన వారి గృహానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేసి, పార్టీ కార్యక్రమాలు, పార్టీ బలోపేతానికి సంబంధించి దిశానిర్దేశం చేస్తున్నామని, అందులో భాగంగా మంగళ వారం ఆత్రేయపురం మండలంలో నూతన అధ్యక్షునిగా బాధ్యతలు తీసుకున్న యు . వెంకటేశ్వరరావు గృహానికి ర్యాలి గ్రామం విచ్చేసామని తెలిపారు. మండలంలోని 17 గ్రామాలలో ప్రతి బూత్ నందు బిజెపి జెండా రెపరెపలాడాలని, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా కలిసి ముందుకు సాగాలని ఆయన కోరారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో అందిస్తున్న సంక్షేమ పథకాలు గ్రామాలలో ప్రజలకు వివరించాలని తెలిపారు.

అనంతరం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వేద పండితులు అవధాని వేద ఆశీర్వచనం చేయగా ఆలయ కార్య నిర్వహణ అధికారి భాగవతుల వెంకట రమణమూర్తి స్వామివారి చిత్రపటం చరిత్ర కలిగిన పుస్తకం శేష వస్త్రంతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చీకురుమెల్లి శ్రీనివాసరావు, కొత్తపేట నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబుగౌడ,మండల ప్రధాన కార్యదర్శి తాడాల సుబ్రమణ్యం (పండు), రాష్ట్ర కిసాన్ మోర్చసభ్యులు చేకూరి రమేష్ వర్మ, ఓబీసీమోర్చా కార్యవర్గ సభ్యులు గూడవెల్లి రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు వానపల్లి శేషగిరిరావు, బూత్ కమిటీ అధ్యక్షులు నరుకుల వీరభద్రం, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కాంప్లెక్స్ లో జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్.




**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18 :** జెఎన్టియుకె ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడలోని ఆర్టిసి బస్ స్టేషన్ నందు భారీ పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డా.జి. శ్యామ కుమార్ అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ముందుగా యూనివర్శిటీ మెయిన్ గేట్ వద్ద ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి. రవీంద్రనాథ్ ప్రారంభించగా యుసిఇకె ఇన్చార్జి ప్రిన్సిపాల్ ప్రొ. ఎన్. మోహన్రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. జివిఎస్ఆర్. దీక్షితులు, ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టరేట్ నుంచి సంజయ్ కుమార్ లు విచ్చేశారు.ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డా. జి.శ్యామ కుమార్ మాట్లాడుతూ కేంద్ర యువజన వ్యవహారాలు %డ% క్రీడల మంత్రిత్వ శాఖ మరియు హైదరాబాద్లోని ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ డైరెక్టరేట్ మార్గదర్శకాల ప్రకారం ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ ఎం. రామకృష్ణ సహకారంతో కాకినాడలోని ఆర్టిసి బస్ స్టేషన్ వద్ద భారీ పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 200మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పరిశుభ్రతా కార్యక్రమంలో పాల్గొని చెత్తను సేకరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జెఎన్టియుకె, యుసిఇకె ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె.రమణాజీ, ఎంవిఎస్వి. కిరణ్మయి, డా.పి. వీరలక్ష్మి, బోధనేతర సిబ్బంది, జెఎన్టియుకె మరియు అనుబంధ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కాకినాడ ఆర్టిసి డిపో మేనేజర్ ధర్మారావు, ఆర్ టిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టైగర్ ట్రియంఫ్-25 సైనిక విన్యాసాల కొరకు అవసరమైన సివిల్ సహకారాన్ని అందించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18 :** కాకినాడ తీరంలోని నేవల్ ఎన్ క్లేవ్ లో వచ్చే ఏప్రియల్ 8 నుండి 13వ తేదీ వరకూ భారత్, అమెరికా వాయుసేనా దళాలు ఉమ్మడిగా నిర్వహించనున్న టైగర్ ట్రియంఫ్-25 సైనిక విన్యాసాల కొరకు అవసరమైన సివిల్ సహకారాన్ని అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను కోరారు.మంగళవారం మద్యాహ్నం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు అధ్యక్షతన ఆయన ఛాంబరులో ఏప్రియల్ 8 నుండి 13 వరకూ కాకినాడ తీరంలో సైనిక విన్యాసాల నిర్వహణపై సైనిక, సివిల్ అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సివిల్–మిలటరీ లైజాన్ అధికారి కమాండర్ వై.కె.కిషోర్ మాట్లాడుతూ భారత్, అమెరికా వాయుసేనల సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రియల్ 1 నుండి 13వ తేదీ వరకూ టైగర్ ట్రియంఫ్–25 పేరిట ఉమ్మడి సైనిక విన్యాసాలను విశాఖపట్నం, కాకినాడ తీరాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా ఏప్రియల్ 8 నుండి 13వ తేదీ వరకూ కాకినాడ తీరంలోని నేవల్ ఎన్ క్లేవ్ లో యాంఫీబియస్ విన్యాసాలు సముద్రంలోను, ఉపరితలంపైన జరుగుతాయని, ఈ కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ మేరకు సైనికాధికారులు కోరిన అంశాలపై శాఖల వారిగా చేపట్టవలసిన చర్యలను డిఆర్ఓ వెంకట్రావు ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఏప్రియల్ 7వ తేదీ నాటికి విన్యాసాలు జరిగే కాంపింగ్ సైట్ లో చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేయించాలని, అలాగే విన్యాసాలు జరిగే వారం రోజులు పారిశుద్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది, యంత్రాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్, పంచాయితీ అధికారులకు సూచించారు. అగ్నిమాపక శాఖ నీటితో నింపిన రెండు ఫైర్ టెండర్లను, సిబ్బందిని వారం రోజులు అందుబాటులో ఉంచాలని కోరారు. విన్యాసాలు జరిగే ప్రాంతంలో స్టేట్ హైవే బ్లాకింగ్, బారికేడింగ్, ట్రాఫిక్ మళ్లింపు, క్రౌడ్ నియంత్రణ అంశాలను పోలీస్ శాఖ చేపట్టాలన్నారు. అలాగే సైనిక అధికారులు, సిబ్బంది, సామాగ్రిని విశాఖపట్నం, కాకినాడల మద్య సంచరించే రూట్లలో రోడ్ కాన్వాయ్ ఆపరేషన్స్ కు అవసరమైన సహకారాన్ని సైనిక అధికారులకు అందించాలన్నారు. సైనిక విన్యాసాలు దృష్యా ప్రవేశ అనుమతి ఉండని నో పబ్లిక్ జోన్ ప్రాంతాల గురించి నేవల్ ఎన్ క్లేవ్ పరిసర గ్రామాల ప్రజలందరికీ సమాచారాన్ని పంచాయితీ కార్యదర్శుల ద్వారా తెలియజేయాలని డిపిఓ ను కోరారు. అలాగే సముద్రంలో విన్యాసాలు జరిగే ప్రాంతానికి సమీపంలోకి మత్స్యకారుల బోట్లు ప్రవేశించకుండా మత్స్య శాఖ, మెరైన్ పోలీస్ శాఖలు కట్టుదిట్టం చేయాలన్నారు. ప్రథమ చికిత్స అందించేందుకు కాకినాడలోని వివిధ ప్రయివేట్ ఆసుపత్రులనుండి అడ్వాన్సు లైఫ్ సపోర్టింగ్ సిస్టమ్స్ కలిగిన అంబులెన్స్ లను వారం రోజులు అందుబాటులో ఉంచాలని డిఎంహెచ్ఓ ను కోరారు. 11వ తేదీన ఉన్నత సైనిక అధికారులు విన్యాసాల సందర్శించనున్న 11వ తేదీన ఉదయం మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తారని, ఇందుకు అవసరమైన మీడియా సమన్వయం చేపట్టాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిని కోరారు. అంతర్జాతీయ సైనిక దళాల భాగస్వామ్యంతో భారత సైన్యం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టైగర్ ట్రియంఫ్–25 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వంతో సహకరించాలని డిఆర్ఓ వెంకట్రావు కోరారు.

ఈ సమావేశంలో సైనిక అధికారి టివివి ప్రసాద్, మైరైన్ పోలీస్ అధికారి రామ్మోహన్ రెడ్డి, రూరల్ సిఐ చైతన్య కృష్ణ, ఎంహెచ్ఓ డా.పృద్వీ, మత్స్యశాఖ అధికారి అనూరాధ, కెఎస్పిఎల్, ఫైర్, మెడికల్ అండ్ హెల్త్, పంచాయితీ, ఇంటిలిజెన్స్, సమాచార శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల

## పేద విద్యార్థుల చదువుకు భరోసా



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18 :**కాకినాడ నగరం 27వ డివిజన్ కి చెందిన కాళ్ళ సాయి మంగాదేవి ఎమ్మెస్సీ,ఎంబీఏ ,గంగాధర్ తేజ శ్రీ ఇద్దరూ కూడా ఒకరు గ్రాడ్యుయేట్ ఇంకొకరు ఇంకా విద్యను కొనసాగిస్తున్నారు.వీరు ఇద్దరూ కూడా పేద కుటుంబానికి చెందిన వారు అయినా ఐ ఏ ఎస్ అవ్వాలనే సంకల్పంతో ఉన్నారు. వీరి పట్టుదలను చూసి ఉభయ గోదావరి ఎమ్మెల్సీ ఎలక్షన్ ముందు,పేరాబత్తుల రాజశేఖరం, ఎలక్షన్ అనంతరం వీరి విద్య నైపుణ్యం పెంచుటకు భవిష్యత్తులో వీరికీ ఎటువంటి సహాయం అందించాలో స్వయంగా వచ్చి తెలుసుకుంటాను అని మాట ఇవ్వడం జరిగింది.ఆ మాట ప్రకారం కాకినాడ నగరంలో స్థానిక ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావు తనయుడు అయిన వనమాడి మోహన్ వర్మ ని వెంట పెట్టుకుని తేజ శ్రీ , కాళ్ళ సాయి మంగాదేవి ఇంటికి వెళ్లి వారి పెద్దలతో మాట్లాడి వారికి భరోసా ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి సభ్యులు పాల్గొన్నారు.

# గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పటిష్టంగా అమలు చేయాలి





- 3వ సెషన్స్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ పి.కమలా దేవి

**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18 :** గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పటిష్టంగా అమలు చేయాలని 3వ సెషన్స్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ పి.కమలా దేవి ఆదేశించారు.ఆమె ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రొప్రియెట్ అధారిటీ, డిస్టిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ జిల్లా స్థాయి పీసీ, పీఎన్డటీ సమన్వయ కమిటీ సమావేశం వివేకానంద సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన 158 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ నెల నుండి ఫిబ్రవరి నెల వరకు 40 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 347 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. అదేవిదంగా 2 కొత్తగా నమోదు చేసుకున్న స్కాన్ సెంటర్, 4 రెన్యూవల్ 14 స్కాన్ సెంటర్ల మిషన్ మార్పు, డాక్టర్ మార్పు వాటికి కమిటి ఆమోదం తెలిపినది.పి.కమలా దేవి, 3వ సెషన్స్ ఆడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్, కాకినాడ ముఖ్య అతిదిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి బేర్ యాక్ట్ పుస్తకాలను ఆవిష్కరణ చేస్తూ అందరూ రేడియాలజీస్ట్, గైనకలాజిస్ట్ స్కాన్ సెంటర్ ఓనర్లు తప్పనిసరిగా పి.సి.పి.ఎన్.డి.టి. చట్టం యొక్క నియమ నిబంధనలు, తప్పనిసరిగా పాటించాలని సూచించారు. స్కాన్ సెంటర్ నందు రిజిస్టర్లు, ఫారం 'ఎఫ్', కన్సెంట్ ఫారం వంటివి తప్పనిసరిగా మెయిన్ టైన్ చెయ్యాలని సూచించారు.డిఆర్వో జె. వెంకట రావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు స్కాన్ సెంటర్ వారు చట్టాన్ని సక్రమంగా అమలు చేసే దిశగా పనిచెయ్యాలని తెలియజేసారు. డాక్టర్, జె. నరసింహ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, మాట్లాడుతూ కాకినాడ జి.జి.హెచ్. ఫోరెన్సిక్ హెచ్.ఒ.డి. డా. పి. ఉమా మహేశ్వరరావు పి.పి.టి. ద్వారా పి.సి,పి.ఎన్.డిటి యాక్ట్ సంబందించిన విషయాలను తమ స్కాన్ సెంటర్ ఖచ్చితంగా అమలు చెయ్యాలని తెలియజేసారు. డీఐవో డా. కె.వి. సుబ్బరాజు, డా. పి. సరిత మాట్లాడుతూ అకస్మిక తనిఖీలు, డికాయ్ ఆపరేషన్ లు చట్ట ప్రకారం చేస్తున్నామని తెలియజేసారు.ఈ సమావేశంలో, ఎం.జె.వి. భాస్కర రావు, ఎ.ఎస్.పి., డి.ఎల్.ఎ.టి.ఒ డా. ఆర్. రమేష్. డీఐవో డా. కె.వి. సుబ్బ రాజు, డి.సి.హెచ్.ఎస్. డా. ఎస్. స్వప్న, డిప్యూటీ డి.ఎం. హెచ్.ఒ. డా.పి. సరిత, స్వచ్ఛంద సంస్థ ప్రతినిదులు కరణం వెంకటేశ్వరరావు, ఎస్. అప్పల నాయుడు, యల్లా పద్మలత,డి. నాగబాబు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, పి.ఆర్.ఒ.ఎస్.అజయ్, జి.జి. హెచ్. నుండి వచ్చిన హెచ్.ఒ.డి.లు, రేడియాలజీ, పిడియాట్రిక్, గైనిక్, పీడాలజీ డిపార్టుమెంటు డా.కె.ఎస్.సునీత, డా. బి.రాంబాబు, డా. సి. హెచ్, మాధురి, డా. టి. శ్రీధర్,డా ఎస్. నందిశ్వర, ప్రభుత్వ , ప్రైవేటు రేడియాలజీ, గైనకాలజీ, డెమో సిబ్బంది పాల్గొన్నారు.

# మర్రిపాకలో పేకాట శిబిరంపై దాడి



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 18:** జగ్గంపేట మండలం మర్రిపాక గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు జగ్గంపేట సీఐ వై ఆర్ కే శ్రీనివాస్ కు సమాచారం రావడంతో మంగళవారం జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.20,450 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశారు. ఎవరైనా జూద క్రీడలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ వై ఆర్ కె, ఎస్ఐ రఘునాథరావు హెచ్చరించారు.

# జేసీని కలిసిన బిఎంఎస్ ప్రతినిధులు.



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18 :** మంగళవారం ఉదయం భారతీయ మజ్దూర్ సంఘ ప్రతినిధులు తాళ్లూరి జగదీష్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను ఆయన చాంబర్లో కలిశారు. దేశవ్యాప్తంగా బి ఎం ఎస్ ప్రతినిధులు దేశ ప్రధానికి వినతి పత్రం సమర్పించే భాగంగా,ఈ సందర్భంగా జెసికి వినతిపత్రం సమర్పిస్తూ, ఈపీఎస్ 95 పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల విశ్రాంత ఉద్యోగులకు కార్మికులకు ఇచ్చే పెన్షన్ వెయ్యి రూపాయల నుండి 5000 రూపాయల వరకు పెంచమని కోరారు. దేశవ్యాప్తంగా ఇటువంటి వారు సుమారు 78 లక్షల మంది ఉన్నారని వారికి పెన్షన్ పెంచడంతో పాటుగా డి ఏ కూడా ఇవ్వాలని, ఆయుష్మాన్ భారత్ పథకం ఆరోగ్య కార్డులు అందించే విధముగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ, జిల్లా కలెక్టర్ ద్వారా దేశ ప్రధానికి వినతి పత్రం పంపించారు. ఈ కార్యక్రమంలో బి ఎం ఎస్ ప్రతినిధులు పి ఆర్ వి రావు, బి అప్పారావు, పి వీరాంజనేయరావు, ప్రవీణ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ అన్న మాటే మాకు శాసనం

- ఆయన ఆదేశిస్తే దేనికైనా మేము సిద్ధం
- మావులూరి సురేష్ నాయుడు



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18 :**పవనన్న మాటే మాకు శాసనం అని ఆయన ఆదేశిస్తే ఏ పని చేయడానికి అయినా తమ సిద్ధమని ఆయన అభిమానులుగా పార్టీ సైనికులుగా పనిచేసే ఆయనను గెలిపించుకున్నామని డిప్యూటీ సీఎం హోదాలో ఆయనను చూసుకుంటున్నామని జనసేన పార్టీ నాయకులు సురేష్ అన్నారు. ఆయన ఆదేశం ప్రకారమే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా స్వచ్ఛ మైదాన్ కమిటీ సభ్యునిగా ఉంటూ వరుసగా 4వ రోజు స్వచ్ఛ మైదాన్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని నేటితో సభాస్థలి పరిశుభ్రతా పనులు పూర్తిచేసామని అన్నారు.తమతో పాటు అనేకమంది జనసైనికులువీరమహిళలు కాకినాడ నుండీ వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించారని అన్నారు.జనసైనికులు వీరమహిళలు ఇకముందు జనసేవకులుగా మారి ప్రజా సేవలో పవనన్న ఆదేశాలమేరకు పనిచేయడానికి సిద్ధంగా ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో మోసా యోసేపు, పెంకే జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# కిర్లంపూడిలో మండలం బిజెపి కార్యవర్గ సమావేశం.





**-నూతన మండల శాఖ అధ్యక్షుడు ఎన్నికపై అభిప్రాయ సేకరణ.**

**కిర్లంపూడి, పెన్ పవర్,మార్చి 18:** మండల కేంద్రమైన కిర్లంపూడిలో భారతీయ జనతా పార్టీ కిర్లంపూడి మండలం కార్యవర్గ సమావేశం మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక విజ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన మండల బిజెపి అధ్యక్షుడు ఎన్నికపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. సదర్ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు నియోజవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ,జిల్లా ప్రధాన కార్యదర్శిలు దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, గండి కొండలరావు, మట్ట మంగరాజు, కామినేని జయశ్రీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కంట కాశీ విశ్వనాథం, దొడ్డా అప్పారావు, శరకణం రాజబాబు,కోనేటి శ్రీనివాస్, బాలిన వెంకటేశ్వరరావు,బొడ్డేటి సత్య నారాయణ, ఐ. వి.వి సత్యనారాయణ, ఏనుగుపల్లి జలబాబు,మత్స వెంకటరమణ, గోడి లక్ష్మి, భువనగిరి కాశి విశ్వనాథం, అల్లు శివరామకృష్ణ, ఆడారి రామచంద్ర, భూమనాదుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మన కనీస కర్తవ్యం



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 18:** జగ్గంపేట వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పోస్ట్ ఆఫీస్ ప్రాంగణంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ డిస్టిక్ గవర్నర్ కొత్త కొండ బాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రెసిడెంట్ ఎం.సురేష్, వెత్సా నాగసత్య, సెక్రెటరీ మానేపల్లి సతీష్, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కొత్త కొండబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన కనీస కర్తవ్యం అన్నారు. భావితరాలకి మనం మంచి వాతావరణం అందించేలాగా అందరూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని పేర్కొన్నారు.

## అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు



**గోకవరం/కోరుకొండ పెన్ పవర్ మార్చి 18 :** నార్త్ జోన్ డిఎస్పి వై శ్రీకాంత్ నార్త్ జోన్ స్పెషల్ టీం తో కలిసి మంగళవారం కోరుకొండ బస్టాండు ఎదురుగా ఉన్న కిల్లీ షాపునందు తనిఖీ చేయగా కోడినాగుల రాజబాబు అనే వ్యక్తి సుమారు 4,400 విలువగల మద్యం అమ్ముతూ పట్టుబడ్డాడు . రాజబాబుపై కేసు నమోదు చేసి కోర్టునందు హాజరపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు కోరుకొండ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ టి.శ్యాంసుందర్ తెలియజేశారు.

## కోడిపందాలపై పోలీసులు దాడి



**గోకవరం పెన్ పవర్ మార్చి 18 :** కోరుకొండ సిఐ సత్య కిషోర్ పర్యవేక్షణలో గోకవరం ఎస్సై వివిఎన్వి పవన్ కుమార్, కోరుకొండ ఎస్సై శ్యాంసుందర్ తమ సిబ్బందితో కలిసి గోకవరం మండలం ఇటికలపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడిపందాలు పై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 7200 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాలు నిర్వాహకుడు కోడి కత్తులు కట్టే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోడి పందాలు పేకాట వంటి జూదాలను నిర్వహించినా వాటిని ప్రోత్సహించిన వారిపైన కేసులు నమోదు చేసి చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామనిపోలీసులు హెచ్చరించారు.

# మండలంలో జ్యోతుల రామస్వామి విస్తృత పర్యటన

### అపూర్వ స్వాగతం పలికిన వైసీపీ శ్రేణులు



**గోకవరం, పెన్ పవర్ మార్చి18:** జగ్గంపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జ్యోతుల చంటి బాబు తండ్రి జ్యోతుల రామస్వామి మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు.మండలంలోని గంగంపాలెం, ఠాగూర్ పాలెం, తిరుమలాయపాలెం, రంప ఎర్రంపాలెం ,పెంటపల్లి, బావాజీ పేట, వెదురుపాక, గుమ్మల దొడ్డి, అచ్యుతాపురం గ్రామాలలో పర్యటించిన జ్యోతుల రామస్వామికి వైసిపి పార్టీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జ్యోతుల రామస్వామి మాట్లాడుతూ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నానని పార్టీ బలోపేతం కోసం, కార్యకర్తలలో ధైర్యం నింపి రానున్న రోజుల్లో ఉద్యమస్ఫూర్తితో ముందుకు కదిలేలా కార్యచరణతో పనిచేయడానికి పార్టీ శ్రేణులలో ఉత్తేజం నింపడానికి పర్యటిస్తున్నాని చెప్పారు.పార్టీ దురదృష్టవశాత్తు పరాజయం పాలైనా పార్టీ శ్రేణుల్లో ఏమాత్రం హుషారు తగ్గలేదని కార్యకర్తలను చూస్తుంటే ఇంకా రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని అనిపిస్తుందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోనికి తీసుకొచ్చి జగన్మోహన్ రెడ్డి గారిని మళ్లీ ముఖ్యమంత్రి గా చేసుకునే వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరం కంకణబద్ధులై పనిచేద్దాం అని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు యోగక్షేమాలు తెలుసుకున్న జ్యోతుల రామస్వామి మీకు ఏ కష్టం వచ్చినా జ్యోతుల చంటిబాబు,నేను నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

రానున్న కొద్ది రోజుల్లో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తలతో భారీ సమావేశం ఏర్పాటు చేసే ఉద్దేశ్యం ఉందని తెలిపారు. కార్యక్రమాల్లో భారీ స్థాయిలో ఆయా గ్రామాల నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొనడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది.

# ఉద్యానవన పంటల ద్వారా ఆర్థిక అభివృద్ధి-ఎంపీపీ కృష్ణారెడ్డి



**గంగవరం, పెన్ పవర్, మార్చి 18:** గిరిజన రైతులు జీడి మామిడి వంటి ఉద్యానవన పంటలు ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, ఐటీడీఏ ద్వారా అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అన్నారు గంగవరం సచివాలయంలో హార్టికల్చర్ పి హెచ్ ఓ చిట్టిబాబు ఆధ్వర్యంలో గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై మంజూరైన స్ప్రేయర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలు ఉద్యాన పంటలు గిరిజన రైతులు ఐటీడీఏ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గంగవరం మండలంలో 50 మందికి సబ్సిడీపై మంజూరు చేసిన స్ప్రేయర్లను పంపిణీ చేశారు. 20వేల రూపాయలు విలువగల స్ప్రేయర్ గిరిజన రైతులకు 1734 రూపాయలకే అందించడం జరిగిందన్నారు. వైస్ ఎంపీపీ కే గంగాదేవి మాట్లాడుతూ గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వం మంజూరు చేస్తున్న సద్వినియోగం చేసుకోవాలన్నారు ఎంపీఈవో పి స్వర్ణలత మాట్లాడుతూ లబ్ధిదారుని వాటా 1734 రూపాయలు కాగా ఐటిడిఏ సబ్సిడీ 7606 రూపాయలు ఎంఐడిహెచ్ వారి సబ్సిడీ8000 రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలోని ఎనిమిది గ్రామపంచాయతీలకు చెందిన రైతులకు ఈ సబ్సిడీ స్పేయర్లు మంజూరు చేసినట్లు వివరించారు. గంగవరం సర్పంచ్ కలుముల అక్కమ్మ , వైస్ ఎంపీపీ కే గంగాదేవి ,మాజీ ఎంపీటీసీ కే. బుల్లియమ్మ, గంగవరం ఉపసర్పంచ్ పరదా వెంకటేశ్వరరావు, సచివాలయ పట్టు పరిశ్రమ సహాయకురాలు రెహనా రైతులు పాల్గొన్నారు.

# బాపన్న దొర ఆధ్వర్యంలో నియోజకవర్గం సమావేశానికి తరలివెళ్లిన బిజెపి శ్రేణులు



**గోకవరం మార్చి,18:** జగ్గంపేటలో భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. గోకవరం మండల అధ్యక్షులు ఇనకోటి బాపన్న దొర ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సమావేశానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా గోకవరం మండలంలో బీజేపీ పార్టీ బలోపేతానికి చేస్తున్న కార్యక్రమాలు, కమిటీలు, పలు అంశాలు గురించి ఇనకోటి బాపన్న దొర జిల్లా అధ్యక్షులు విశ్వేశ్వర రావుకి వివరించారు. అనంతరం పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు బుక్లెట్లలను ఆయనకు అందజేశారు. మండలంలో వందశాతం బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా బిక్కిన విశ్వేశ్వరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట మంగరాజు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు సత్తి వెంకటరెడ్డి, నాయకులు దాసరి ధర్మరాజు, నియోజకవర్గ కో- కన్వీనర్ కోన సురేష్, రైల్వే బోర్డు మెంబర్ వెంకన్న బాబు, మండల ప్రధాన కార్యదర్శి ముప్పిడి నాగేశ్వరరావు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కాకి మణికంఠ, మండిగ వెంకన్న దొర, దాసరి నరసింహారావు, గొంతెన బాపిరాజు, మామిడి వీర వెంకట సత్యనారాయణ, ముమ్మిడివరపు రామకృష్ణ, ముక్క శ్రీను, అడప దొరబాబు, అప్పలరాజు ఆదం మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు మైక్ సెట్లు పంపిణీ






**ప్రత్తిపాడు, పెన్ పవర్, మార్చి 18 :** వెనుకబడిన దేవాలయాలకు దానధర్మ ట్రస్ట్ వారిచే మైక్ సెట్లు ఇవ్వడం జరుగుతుందని ట్రస్ట్ సభ్యురాలు నేదూరి జయలక్ష్మి అన్నారు. మంగళవారం కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం తామరాడ మరియు ప్రత్తిపాడు మండలం టి రాయవరం గ్రామాల్లో రెండు మైక్ సెట్లు బహూకరించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ గ్రామదేవతల ఆలయాలు బాగు చేసుకుందామని,మన హిందూ ధర్మాన్ని సంస్కృతిని కాపాడుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శివ,సతీష్ పాల్గొన్నారు.

# మహిళల పై జరుగుతున్న, అగాహిత్యలపై అవగాహన





**రావులపాలెం పెన్ పవర్ మార్చ్ 18:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ సీఐడీ డాక్టర్ రవిశంకర్ అయ్యర్ ఆదేశాల తో మంగళ వారం రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమములో మహిళల భద్రత. వారికున్న హక్కులు చట్టాల ప్రస్తుతం కొత్తగా వచ్చిన చట్టాలు కోసం వివరించారు. సైబర్ నేరాల. నియంత్రణ. వాటిపై అప్రమత్తం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమము లో అష్మఫేర్విన్ అడిషనల్ ఎస్పీ సీఐడీ వారి ఉత్తర్వుల మ తో కె ఏ స్వామి ఇన్స్పెక్టర్ సీఐడీ.జె జె రత్న ప్రసాద్ ఇన్స్పెక్టర్ సీఐడీ బి వెంకటేశ్వర రావు ఇన్స్పెక్టర్ సీఐడీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సపాల్ సీఐడీ సిబ్బంది. కాలేజి సిబ్బంది. పాల్గొన్నారు

# మండపేట కు నిధులు కేటాయించాలి.

**అసెంబ్లీ లో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు .**



**మండపేట. పెన్ పవర్. మార్చి 18:**ఎన్ ఆర్ జి ఎస్ నిధుల్లో వెనుక బడ్డ మండపేట నియోజకవర్గానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అదనం గా నిధులు కేటాయించాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. అసెంబ్లీ లో మంగళవారం ఆయన తన గళాన్ని వినిపించారు. జాతీయ ఉపాధిహామి పథకం ద్వారా వచ్చే గ్రాంటు కొన్ని జిల్లాలలో సుమారు రూ.30.00 నుండి 40.00 కోట్లు ఇస్తున్నారని వివరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ జిల్లాలో అయితే కనీసం రూ.20.00 కోట్లు, రాజమండ్రి కి కనీసం రూ.18.00 కోట్లు ఇచ్చారన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా లోని తన మండపేట నియోజకవర్గంలో రూ.5.50 కోట్లు చాలా తక్కువగా ఇచ్చారని అవేదన వ్యక్తం చేశారు.దీనిని అందరికి సమన్యాయం చేయలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రకరకాల స్కీముల ద్వారా వచ్చేగ్రాంటును, జాతీయ ఉపాధిహామి పథకం ద్వారా తక్కువ గ్రాంటు వచ్చే నియోజకవర్గాలకు బదలయిస్తు ఎక్కువ గ్రాంటు ఇవ్వాలని డిప్యూటి సి.ఎం, పంచాయితీరాజ్ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ ని అసెంబ్లీ సమావేశంలో అంచనాల కమీటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కోరారు.

## సీనియర్ రాజకీయ వేత్త యనమలకు రాజ్యసభ ఇవ్వాలి.

**ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు.**




**మండపేట. పెన్ పవర్. మార్చ్ 18:**శాసన మండలిలో సుమారు ఏడుగురు ఎమ్మెల్సీల పదవీ కాల పరిమితి ముగియనుంది. ఈ నేపథ్యంలో శాసన మండలి లో వారికి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ వివిధ విభాగాల్లో నిష్ణాతులైన వారి సేవలు ప్రభుత్వాలు ఇప్పటి వరకు వినియోగించుకున్నాయని పేర్కొన్నారు. తనకి అత్యంత సన్నిహితుడు తన సహచర రాజకీయ ప్రయాణంలో కలిసి ప్రయాణించిన సీనియర్ రాజకీయవేత్త యనమల రామకృష్ణుని గూర్చి ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, వివిధ శాఖ మంత్రులు గా పనిచేసిన యనమలకు రాజ్యసభ పదవి ఇవ్వాలన్నారు. ఆయనకు ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలపై ఉన్న నిష్ణాతనమైన పరిజ్ఞానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. యనమల వంటి బహుముఖ ప్రజ్ఞాశాలిని రాజ్యసభకు పంపడం ద్వారా సీనియారిటీ ను గౌరవించడమే కాకుండా తమను తమే గౌరవించుకోవడమేననీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు.

# వైసీపీకి రానున్నదంతా గడ్డుకాలమే



**విజయవాడ, మార్చి 18, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో వైసీపీకి రానున్న కాలమంతా గడ్డుకాలమే. ఎందుకంటే ఇప్పటికే అనేక విషయాలపై విచారణ ప్రారంభించిన ప్రస్తుత ప్రభుత్వం అన్ని విభాగాల్లో జరిగిన అవినీతిపై లోతైన దర్యాప్తు చేయనుంది. అయితే ఆధారాలను స్పష్టంగా సేకరించిన తర్వాత మాత్రమే కేసులు నమోదు చేయనున్నారు. న్యాయస్థానాల్లో వీగిపోకుండా పకడ్బందీగా అగ్రనేతల మెడ చుట్టూ కేసుల ఉచ్చు బిగుసుకునే ఛాన్స్ ఉంది. గత ప్రభుత్వంలో అనుసరించిన లిక్కర్ అమ్మకాలపైనే ఈ ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. లిక్కర్ స్కామ్ లో నిందితులను వరసగా అరెస్ట్ లు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే ఒక ప్రణాళిక ప్రకారం పోలీసు ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించనున్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లిక్కర్ అమ్మకాలను ప్రభుత్వమే జరిపింది. నాసిరకం మద్యాన్ని అధిక ధరకు విక్రయించడం, డిజిటల్ పేమెంట్స్ కు అంగీకరించకపోవడం వంటి అంశాలు ఈ విచారణలో కీలకంగా మారనున్నాయి. ప్రయివేటు సిబ్బందిని లిక్కర్ దుకాణాల్లో నియమించి జరిపిన అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తం ఎటు వెళ్లిందన్న దానిపై ఇప్పటికే ఆరా తీస్తున్నారు. ఈ కేసులో ప్రధానంగా ఇటీవల మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేరును కూడా బయటపెట్టారు. ఆయనలే లిక్కర్ వ్యాపారంలో కీలకంగా వ్యవహరించారని సాయిరెడ్డి ఆరోపించారు. మద్యం కుంభకోణంలో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి కీలక పాత్ర పోషించారంటూ సాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఇప్పుడు ఈ ఫైలు వేగంగా ముందుకు కదులుతుంది. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి గత ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా పనిచేశారు. అతనే ప్రధాన సూత్రధారి అంటూ సాయిరెడ్డి చేసిన కామెంట్స్ కోణంలో అధికారులు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది. తెర వెనక ఉండి ఆయనే అంతా నడిపించారని, లిక్కర్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఎక్కడకు వెళ్లాయన్నది కసిరెడ్డిని విచారిస్తే ఖచ్చితంగా తెలుస్తుందని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో వైసీపీ అగ్రనేతల ప్రమేయం ఉండే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వ పెద్దలు కొంత ఆలస్యమయినా పకడ్బందీగా కేసును రూపొందించాలని ఆదేశాలు జరీ చేసినట్లు సమాచారం. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి విదేశాల్లోనూ లిక్కర్ షాపులను నడిపిన అనుభవం ఉందని తెలియడంతో ఆయన గత ప్రభుత్వంలో ఈ స్కాంలో కీలకంగా వ్యవహరించారంటున్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు అత్యంత దగ్గరని, అప్పుడని కూడా గుర్తించారు. ఈ కోణంలోనే దర్యాప్తు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. కసిరెడ్డి రాజవేఖర్ రెడ్డి దొరికితే మొత్తం వ్యవహారం బయటకు వస్తుందని విచారణ చేస్తున్న అధికారులు భావిస్తున్నారు. కసిరెడ్డి కోసం ఇప్పటికే వేట ప్రారంభమయిందని చెబుతున్నారు. ఆయన దొరికిన వెంటనే మద్యం కేసులో కీలక నేతలను కొందరిని అదుపులోకి తీసుకుని విచారణ చేసే అవకాశముందని కూడా అధికార వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. డిస్టలరీలు, మద్యం అమ్మకాలు, నాసిరకం మద్యం వంటి అంశాలపై ఇప్పటికే కొంత మేరకు ఆధారాలను సేకరించిన అధికారులు స్పష్టమైన సాక్షాధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. అవి లభించినట్లే ఊహించని పరిణామాలు ఏపీలో జరిగే అవకాశముందని చెబుతున్నారు.

# పవన్ డిఫెన్స్ లో పడిపోయారా



**విజయవాడ, మార్చి 18, పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం తాను అనుకున్నది సాధించలేకపోతున్నారు. లక్ష్యం కూడా ఎంత దూరంలో ఉందో తెలియదు. ముఖ్యమంత్రి గా పవన్ కల్యాణ్ ను చూడాలని కాపు సామాజికవర్గం, పవన్ అభిమానులు బలంగా కోరుకున్నారు. కానీ పవన్ కల్యాణ్ లో అటువంటి ఆలోచన లేకపోవడంపై వారిలోనే చర్చ జరుగుతుంది. తాము అనుకున్నది వేరని, ప్రతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు కాపు సామాజికవర్గానికి చెందిన వారుంటారని, ఇక పవన్ కల్యాణ్ కు మద్దతిచ్చినందుకు ప్రత్యేకంగా సాధించింది ఏముందన్న ప్రశ్న ఆ సామాజికవర్గం నుంచి ఈ మధ్య కాలంలో బలంగా వినిపిస్తుంది. వైసీపీ విమర్శలు చేస్తూ కాలం గడిపేసే రోజులు పోయాయి. ఎందుకంటే జగన్ ఇప్పుడు అధికారంలో లేరు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీల అమలుపై కూడా పవన్ కల్యాణ్ ప్రశ్నించకపోవడంతో పాటు టీడీపీకి బలమైన మద్దతుదారుగా మారడాన్ని కూడా జనసేన కార్యకర్తల నుంచి సామాజికవర్గం నేతలు, అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. తాము ఊహించింది ఒకటి.. జరుగుతున్నదొకటిలా తయారయిందన్న నిరాశ నిస్పృహలు వారిలో కనిపిస్తున్నాయి. అయితే తాము ఏ మాత్రం దాచుకోకుండా తమ అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా కుండబద్దలు కొట్టేస్తున్నారు. పదేళ్ల పాటు చంద్రబాబు ముఖ్యమంత్రిగానే కొనసాగుతారని చేసిన పవన్ కల్యాణ్ వ్యాఖ్యల దగ్గర నుంచి ఇటువంటి పరిస్థితి తలెత్తింది.ఇక కాపు, బలిజ సంక్షేమ సేన నేత హరిరామ జోగయ్య కూడా పవన్ కల్యాణ్ ను నేరుగా తప్పుపడుతూ బహిరంగ లేఖను రాస్తున్నారు. ఇది కొంత పవన్ తో పాటు జనసేనకు కూడా ఇబ్బందికరంగా మారింది. రాజధాని నిర్మాణం కోసం వేల కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తున్న ప్రభుత్వం తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల అభివృద్ధిపై పవన్ కల్యాణ్ పెదవి విప్పకపోవడంపై జనసేన అధినేత ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయి. రాజధాని నిర్మాణం అనేది దశల వారీగా జరగాలని, అంతే తప్ప నిధులన్నీ అక్కడ వెచ్చించి మిగిలిన ప్రాంతాలకు, సంక్షేమ పథకాలను అందించకుండా ప్రజలను మోసం చేయడం కాదా? అని కాపు నేతలే ప్రశ్నిస్తున్నారు.వరసగా అగ్రనేతలు తప్పని కష్టాలు ఇరకాటంలో పెట్టేదే... ఇది కొంత పవన్ కల్యాణ్ ను ఇరకాటంలో పెట్టేదే. ఎందుకంటే పవన్ కల్యాణ్ పై ఎన్నికలకు ముందు వరకూ ఎన్నో హోప్స్ ఉన్నాయి. 2014 నుంచి ఆయన ప్రసంగాలు, ఆవేశపూరిత పంచ్ లు విని ఊగిపోయిన వారు నేడు జరుగుతున్న తీరు చూసి ఉసూరుమంటున్నారు. ఈ విషయం సోషల్ మీడియాలోనే అర్థమవుతుంది. ఎఫెన్స్ లో ఉంటేనే పవన్ కల్యాణ్ ఇమేజ్ పెరుగుతుంది తప్పించి, డిఫెన్స్ లో ఉంటే ఖచ్చితంగా డ్యామేజీ అవ్వకతప్పదని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. మొత్తం మీద పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత వేరే లెవెల్లో ఉంటుందని అంచనా వేసిన వారికి నేడు ఆయన నుంచి వస్తున్న స్పందన చూసి డల్ అయినట్లే కనిపిస్తుంది.

# గుంటూరు వైసీపీలో ప్రత్యేక కుంపట్లు



**గుంటూరు, మార్చి 18, పెన్ పవర్:** కావటి తప్పుకోవడంతో మిగిలిన వైసీపీ లీడర్లలో అయోమయంగుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా కావటి మనోహర్ నాయుడు రాజీనామా చేశారు.. కలెక్టర్ కి తన రిజైన్ లెటర్ పంపించారు మనోహర్ నాయుడు. ప్రస్తుతం కావటి రాజీనామా వ్యవహారం గుంటూరు రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కావటి కార్పొరేషన్‌లో తనకు తీవ్ర అవమానం ఎదురవుతోందని.. వాపోయారు. ఈ అవమానాలు, నిందలు, పరాభవాలను ఎదుర్కొనే ఆత్మస్థైర్యం తనకు లేదని అన్నారు. తాను ఎదుర్కొన్న అవమానాలు, పరాభవాలు గతంలో ఏ మేయర్ గానీ, ఏ ఛైర్మన్ గానీ చూసి ఉండరని చెప్పుకొచ్చారు.ఫ్యూచర్ లో ఇలాంటి పరిస్థితి మరెవరికీ రాకూడదని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు కావటి. పార్టీ మార్పు పైనా క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోన్న పరిస్థితుల్లో తాను జగన్ తోనే ఉన్నట్టుగా చెప్పుకొచ్చారు.ఇవన్నీ ఇలా ఉంటే.. కావటి ఈ నిర్ణయం తీస్కోవడం వెనక అసలు సమస్యేంటని చూస్తే.. 2021లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ పార్టీ నుంచి కావటి మనోహర్ నాయుడు మేయర్ గా ఎన్నికైన సంగతీ తెలిసిందే. ఇంకో ఏడాది పాటు పదవిలో కొనసాగాల్సి ఉంది కావటి మనోహర్ నాయుడు. ఈలోపే ఆయన తన పదవి నుంచి తప్పుకోవడంలో అసలు కారణం.. స్టాండింగ్ కమిటీ వ్యవహారశైలిగా చెప్పుకుంటున్నారు. కొందరు వైసీపీ కార్పొరేటర్లు.. టీడీపీ, జనసేన తీర్థం పుచ్చుకోవడం వల్ల.. కమిటీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు ఆ రెండు పార్టీలకే దక్కాయి. ఈ కమిటీకి మేయరే చైర్మన్ గా వ్యవహరిస్తున్నా.. ఆయనకు తగిన సమాచారమివ్వడం లేదని సమాచారం. ఇందులో మనోహర్ నాయుడిపై అవిశ్వాసం సైతం పెట్టే అవకాశాలు కనిపిస్తున్నట్టు చెబుతున్నారు. స్టాండింగ్ కమిటీలో వైసీపీకి మెజార్టీ లేక పోవడం వల్ల.. ఈ తీర్మానం కూటమి నెగ్గడం ఒక లాంఛనంగా భావిస్తున్నారు. అందుకే కావటి ఇలా అర్ధాంతరంగా ఎవరికీ చెప్పకుండానే రిజైన్ చేసినట్టు అంచనా వేస్తున్నారు.మేయర్ గా కావటి మనోహర్ నాయుడు రాజీనామా ప్రకటన ఇటు వైసిపి వర్గాల్లోనే కాదు.. అటు టిడిపి నేతల్లోనూ షాకింగా మారిందట. ఈ హఠాత్ పరిణామానికి ప్రత్యర్ధి వర్గాల్లోనూ చర్చకు తెరలేపిందట. ప్రస్తుతం నడుస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగంలో.. తనకు కనీస ప్రోటోకాల్ ఇవ్వడం లేదనీ. ఆఫీసు సిబ్బంది ఎప్పుడు వస్తారో రారో కూడా తెలియని గందరగోళ పరిస్థితుల్లోనే తాను రిజైన్ చేస్తున్నట్టు చెబుతున్నారాయన.అయితే ఇలాంటి చిన్న చిన్న విషయాలకే రాజీనామా చేయాల్సిన అవసరమేంటన్నది ఇప్పుడో ప్రశ్నగా మారింది. కనీసం తన సొంత పార్టీ లీడర్లతో కూడా ఆయన సంప్రదింపులు జరిపినట్టే కనిపించడం లేదని అంటున్నారు. జిల్లా అధ్యక్షుడు అంబటి తో కూడా చెప్పినట్టు లేదని చెబుతున్నారు. ఇదెక్కడి విడ్డూరమో అర్థం కావడం లేదని వాపోతున్నారట సగటు గుంటూరు వైసీపీ కార్యకర్త.మేయర్ రాజీనామా పూర్తి వ్యక్తిగతంగా కనిపిస్తోందనీ ఒక అంచనాకు వస్తున్నారు. ఇటు మేయర్ రాజీనామా ప్రకటన వెనక కూటమి నేతల మైండ్ గేమ్ కూడా ఉందని అంటున్నారు. ఈ మేరకు వీరు సక్సెస్ అయినట్టుగానూ భావిస్తున్నారు. మేయర్ పీఠంపై ఇప్పటికే కూటమి నేతల్లో కొందరికి కుతూహలం పెరిగినట్టు సమాచారం. మెజార్టీ జఅఖ కార్పొరేటర్లు కూటమిలోకి రప్పించేందుకు ఓ సీనియర్ కార్పొరేటర్ పెద్ద ఎత్తున ప్రణాళికలు రచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయం తెలియడంతోనే మేయర్ ముందుగా రాజీనామా ప్రకటన చేశారనీ లెక్కిస్తున్నారు. దీంతో కొత్త మేయర్ ఎన్నిక నల్లేరు పై నడకేనని ఫీలవుతోందట సదరు కూటమి నేత వర్గం.ఇటు కూటమి టచ్ లో ఉన్న వైసీపీ లీడర్ల సంగతి అలా ఉంచితే.. పార్టీనే నమ్ముకున్న వారి పరిస్థితేంటన్నది అయోమయంగా మారిందట. తమకెంతో కావలిగా ఉంటాడని భావించిన మనోహర్ నాయుడు.. ఇలా చేతులెత్తేడం ఏమీ బాగోలేదని లోలోన కుమిలిపోతున్నారట. ఆయన భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందో లేదో తెలీదు కానీ తమ పరిస్థితి మాత్రం కుడితిలో పడ్డ ఎలుకలా తయారైందని వాపోతున్నారట.

## కే రన్ ప్రారంభించిన మంత్రి జూపల్లి

**రంగారెడ్డి: పెన్ పవర్:** నిత్య వ్యాయామంతోనే ఆరోగ్యం సాధ్యమని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కూకట్పల్లి ఆల్విన్ కాలనీ తులసి వనం వద్ద అవని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5 కే రన్ కార్యక్రమాన్ని మంత్రి, టూరిజం శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్న జీవితంలో ఏ పని చేయాలన్నా ఆరోగ్యమే ప్రథమం. అందుకే ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేయాలి, అని సూచించారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని, ఆరోగ్య ప్రాధాన్యతను ప్రజల్లో పెంచేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. అలాంటి సంస్థలకు ప్రభుత్వ సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

**కాకినాడ: పెన్ పవర్:** డా.ఎన్టీఆర్ వైద్య సేవలో పనిచేస్తున్న ఫీల్డ్ లెవెల్ సిబ్బందికి ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లూరి బంగారు శ్రీ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వంచర్ల వీరభద్రరావు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి.. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డా. ఎన్టీఆర్ వైద్య సేవ ఫీల్డ్ సిబ్బందికి అంతర్గత ప్రమోషన్ కల్పించాలని.ఉద్యోగ వ్యక్తి మరణిస్తే కుటుంబ సభ్యులకు 15 లక్షలు ఎక్స్ గ్రేషియా, రిటైర్డ్ బెనిఫిట్స్ 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు... ఈనిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆరోగ్య మిత్రలు పాల్గొన్నారు...

## భోగాపురం ఎయిర్ పోర్టులో అపశృతి

**విజయనగరం, మార్చి 18 పెన్ పవర్:** విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనుల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. నిర్మాణ పనుల్లో ప్రమాద ఘటనలో ఓ వ్యక్తి చనిపోయాడు. భోగాపురం విమానాశ్రయం లోపల రహదారుల నిర్మాణం చేపడుతున్నారు. అయితే రోడ్ల నిర్మాణానికి బండరాళ్లు అడ్డుగా రావటంతో వాటిని తొలగించే పనులు చేపట్టారు. అందులో భాగంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం లోపలి ప్రాంతంలో బండరాళ్లను బాంబులు పెట్టి పేల్చేందుకు ప్రయత్నించారు. అయితే ఈ సమయంలో ఒక్కసారిగా బ్లాస్టింగ్ జరగటంతో రామచంద్రపేటకు చెందిన బోర కొత్తయ్య అనే వ్యక్తి చనిపోయాడు. ఘటనలో బోర కొత్తయ్యకు తీవ్ర గాయాలు కాగా.. ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 2026 జూన్ నాటికి అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే భోగాపురం ఎయిర్‌పోర్టుకు అనుసంధానం చేస్తూ 15 రహదారుల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదించారు. ఈ విషయాన్ని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని.. వీఎంఆర్డీఏ పరిధిలోని అన్ని నియోకజవర్గాల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ప్రతిపాదించిన 15 రహదారుల్లో ఇప్పటికే మారికవలస రహదారి నిర్మాణం పూర్తైందని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ వెల్లడించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి మిగతా వాటిని పూర్తిచేస్తామన్నారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 2200 ఎకరాలలో నిర్మిస్తున్నారు. మూడు దశల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు చేపడుతున్నారు. మొదటి దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రెండో దశలో ఈ సంఖ్యను రెట్టింపు చేయనున్నారు. ఇక మూడో దశలో మరో 60 లక్షల మంది ప్రయాణికులు అంటే.. ఏడాదికి కోటీ 80 లక్షల మంది రాకపోకలు సాగించేలా ఎయిర్‌పోర్టు సామర్థ్యాన్ని పెంచనున్నారు. రూ.4592 కోట్లతో మొదటి విడత పనులు చేస్తున్నారు. 2023 మే నెలలో ఈ పనులకు శంకుస్థాపన జరగ్గా.. వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసేలా కేంద్ర పౌర విమానయాన శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.

## సామర్లకోట దగ్గర ఆర్వోబీ

**రాజమండ్రి, మార్చి 18, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా స్టేట్ హైవేలు, నేషనల్ హైవేలు, బ్రిడ్జిలు, ఆర్వోబీలు, ఫ్లై ఓవర్లపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కీలకమైన ఆర్వోబీకి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఇకపై గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పని లేకుండా.. సామర్లకోట రైల్వే గేటు దగ్గర వాహనదారుల నిరీక్షణకు తెర పడనుంది. రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)కి కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు భూ సేకరణతో పాటుగా పలు ఇతర అంశాలపై అధికారులు ఫోకస్ పెట్టారు.ప్రతి రోజూ రాజమహేంద్రవరం, కాకినాడ మార్గాల నుంచి వచ్చే వాహనాలు సామర్లకోట మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఇన్ని రోజులు ఈ రాకపోకలు సాగించడానికి కష్టాలుపడ్డారు.. ఆర్వోబీ రావడంతో వాహనదారులకు విముక్తి కల్పించడానికి ఆర్వోబీ నిర్మించేందుకు కేంద్రం ఓకే చెప్పింది. గతంలోనే రైల్వే గేటు దగ్గర బ్రిడ్జి నిర్మించాలని ప్రజాప్రతినిధులు కేంద్రాన్ని కోరారు, ప్రతిపాదనలుకూడా పంపారు. కాకినాడ జనసేన పార్టీ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సామర్లకోట ఆర్వోబీ గురించి చర్యలు తీసుకోవాలని ఇటీవల కోరడంతో రైల్వే శాఖ నుంచి సానుకూలత వచ్చింది.ఈ ఆర్వోబీ అందుబాటులోకి వస్తే.. రైల్వే గేటు దగ్గర వాహనదారుల నిరీక్షణకు చెక్ పడుతుందంటున్నారు. ఈ మేరకు ఆర్వోబీ నిర్మించడానికి స్థల సేకరణ చేయాలని, పనులకు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించాలని రైల్వే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. 'గేటు సకాలంలో పడకపోవడం వల్ల సిగ్నల్ వ్యవస్థకు ఇబ్బంది కలిగేది.. ఫలితంగా రైళ్ల రాకపోకలకు సాంకేతిక సమస్యలు ఎదురయ్యేవి. త్వరలో నిర్మించే ఆర్వోబీతో ఈ ఇబ్బందులు తొలగుతాయని' అన్నారు. ఈ ఆర్వోబీ పూర్తి చేస్తే వాహనదారుల కష్టాలు తొలగిపోతాయంటున్నారు.ఈ సామర్లకోట రైల్వే గేటు దగ్గర ప్రజలునిత్యం నరకం అనుభవిస్తున్నారు.. గేటుపడితే చాలు వాహనాలు మొత్తం అక్కడ నిలిచిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలోనే ఎప్పటి నుంచో ఇక్కడ ఆర్వోబీ నిర్మించాలనే డిమాండ్ వినిపిస్తోంది. మొత్తానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## నల్లమలలో యురేనియం తవ్వకాలు.. అందోళనలో స్థానికులు

**నల్గొండ: పెన్ పవర్:**పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి మధ్య జరుగుతున్న ఒక కీలకమైన పోరాటంకు నల్లమల ప్రజలు సిద్ధమవుతున్నారు.తమ ఉనికి కే కాదు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు పెను ప్రమాదం పొంచివుందని స్పష్టం చేస్తున్నారు.నల్లమల అడవుల్లో యురేనియం నిల్వలు ఉన్నట్లు తెలుసుకున్న కేంద్ర ప్రభుత్వం నిక్షేపాలను గుర్తించేందుకు అనుమతి ఇచ్చింది.నల్లమల అడవిలోని కుంచోని మూల నుంచి పదర వరకు మొదటి బ్లాక్లో 38 చదరపు కిలో మీటర్లు, పదర నుంచి ఉడిమిల్ల వరకు రెండో బ్లాకులో మరో 38 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నాలుగు వేల బోర్లు వేసి, నమూనాలు సేకరించేందుకు భారత అణుశక్తి సంస్థ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ మేరకు అనుమతులు రావడంతో నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ కు ఎగువభాగంలో అచ్చంపేట, అమ్రాబాద్ అటవీశాఖ అధికారులు,అణు సిబ్బంది కలిసి వారం రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. డ్రిల్లింగ్యంత్రాలు తీసుకు వచ్చేందుకు రూట్మ్యాప్ సిద్ధం చేశారు.నల్లమల అభయారణ్యం లో యురేనియం అన్వేషణ, వెలికితీత కు ప్రత్యేక హెలిక్యాప్టర్ లు రంగంలోకి దింపారు.సమీప గ్రామాల ప్రజలకు తెలియకుండానే ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. ఆలస్యంగా తెలుసుకున్న అ ప్రాంత ప్రజలు పచ్చని అడవిలో విధ్వంసం సృష్టించొద్దంటు పోరాటానికి పిలుపు నివ్వడంతో యూరినియం నిక్షేపాల వెలికితీత అంశంకు తాత్కాలిక బ్రేక్ పడింది.నల్లమల అడవులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. ఇవి తూర్పు కనుమల్లో భాగం. ఇక్కడ అరుదైన వృక్ష, జంతు జాతులు ఉన్నాయి. ఈ అడవుల్లో చెంచు గిరిజనులు నివసిస్తున్నారు. ఈ అడవులు కృష్ణా నదికి నీటిని అందించే ప్రధాన వనరు. నాగార్జున సాగర్ డ్యామ్ కు ప్రధాన నీటి వనరు ఈ అడవులే. ఇక్కడ యురేనియం తవ్వకాలు జరిగితే, ఈ అడవులు, గిరిజనుల జీవనం, కృష్ణా నదిపై ఆధారపడిన లక్షలాది మంది జీవితాలు ప్రమాదంలో పడతాయి." యురేనియం వెలికితీత ఈ ప్రాంత జీవ వైవిధ్యానికి, తెలుగు జాతికి, ప్రజల ఆరోగ్యంపై కూడా ఎన్నటికీ తీరని చేటు చేస్తుందని స్థానికుల అందోళన.

# వారిద్దరూ తప్ప మిగిలిన వారు దండగ: టీమిండియా బ్యాటర్లపై గంగూలీ ఆందోళన



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా ప్రస్తుతం ఫుల్ జోష్ లో ఉంది. ప్రస్తుతం భారత క్రికెట్ జట్టును ఓడించాలంటే ఏ జట్టుకైనా సవాలే. 9 నెలల వ్యవధిలో రెండు ఐసీసీ టైటిల్స్ గెలిచిన టీమిండియా భవిష్యత్తులో ప్రపంచ క్రికెట్ ను శాసించే స్థాయికి చేరుకున్నా ఆశ్చర్యం లేదు. బెంచ్ కూడా చాలా బలంగా కనిపిస్తుంది. రానున్న 10 సంవత్సరాలు భారత క్రికెట్ జట్టు సేఫ్ జోన్ లో ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో ఓడిపోయిన భారత్.. ఆ తర్వాత వరుసగా టీ20 వరల్డ్ కప్.. ఇటీవలే ఛాంపియన్స్ ట్రోఫీలో ఒక్క మ్యాచ్ ఓడిపోకుండా టైటిల్స్ గెలిచింది.

ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచి ఊపు మీదున్నప్పటికీ అంతకముందు ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ సిరీస్.. స్వదేశంలో న్యూజిలాండ్ పై క్లీన్ స్వీప్ కావడం ఆందోళన కలిగించే విషయాలు. ఈ రెండు సిరీస్ లలో బ్యాటర్ల వైఫల్యమే కారణం. ఈ సిరీస్ ఓటములతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ అవకాశాలను చేజార్చుకుంది. వైట్ బాల్ ఫార్మాట్ లో టీమిండియాకు తిరుగులేకపోయినా రెడ్ బాల్ క్రికెట్ లో మాత్రం తడబడుతున్న మాట వాస్తవం. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ భారత టెస్ట్ క్రికెట్ బ్యాటర్లపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. భారత స్టార్ బ్యాటర్లు టెస్ట్ క్రికెట్‌లో తమ గేమ్ ను మెరుగు పరుచుకోవాలని గంగూలీ సూచించాడు.

ఇటీవలే ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఇలా అన్నాడు. "మన జట్టు టెస్ట్ క్రికెట్ ఆడుతున్నప్పుడు నాకున్న ఏకైక ఆందోళన ఏమిటంటే విరాట్, యశస్వి తప్పమిగిలిన ఆటగాళ్లకు విదేశాలలో

యావరేజ్ 40 కంటే ఎక్కువ లేదు. జైస్వాల్ స్వదేశంలో ఆడిన తొమ్మిది టెస్టుల్లో 44.18 యావరేజ్ తో స్కోర్ చేశాడు. మరోవైపు కోహ్లీ విదేశాల్లో 66 టెస్టుల్లో సగటున 41.51 గా ఉంది. రాహుల్, శుభ్‌మాన్ గిల్, పంత్ వంటి వారు తమ బ్యాటింగ్ ను పరిశీలించుకోవాలి. మంచి టెస్ట్ జట్టుగా ఎదగాలనుకుంటే.. టాప్ 6 బ్యాటర్లలో ముగ్గురు లేదా నాలుగురు ఆటగాళ్ల సగటు 50కి దగ్గరగా ఉండాలి. గిల్ నాణ్యమైన టెస్ట్ క్రికెట్ ఆడుతూ తన బ్యాటింగ్ ను ఉన్నత స్థితికి తీసుకెళ్లాలి". అని గంగూలీ రెవ్‌స్పోర్ట్జ్‌లో అన్నాడు.

# ఫ్యూచర్ స్టార్ అని సెలక్ట్ చేస్తే వరుస డకౌట్లు.. పాక్ ఓపెనర్‌కు చేదు అనుభవం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రయోగాలు చేసి న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు వరుస పరాజయాలు పలకరించాయి. 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో 0-2 తో వెనకపడ్డారు. ఈ సిరీస్ లో పాకిస్థాన్ యువ ఓపెనర్ హసన్ నవాజ్ తొలి రెండు మ్యాచ్ లకే చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. దేశవాళీ క్రికెట్ లో పవర్ ఫుల్ హిట్టర్ గా పేరొందిన హసన్ ఆడిన రెండు మ్యాచ్ ల్లో డకౌటయ్యాడు. దీంతో ఈ పాకిస్థాన్ ఓపెనర్ తన మొదటి రెండు టీ20 ఇన్నింగ్స్ ల్లో వరుసగా రెండు డకౌట్‌లైన ఆరవ ఆటగాడిగా నిలిచాడు.మాథ్యూ సింక్లైర్ (న్యూజిలాండ్), జో డెన్లీ (ఇంగ్లాండ్), ఇమ్రుల్ కేస్ (బంగ్లాదేశ్), కైల్ జార్విస్ (జింబాబ్వే), అర్షద్ ఇక్బాల్ వారు ఆడిన తొలి రెండు మ్యాచ్ ల్లో డకౌటయ్యారు. తాజాగా నవాజ్ వారి సరసన చేరాడు. నవాజ్ రెండు సార్లు తొలి ఓవర్ లోనే పేసర్ జాకబ్ డఫీ బౌలింగ్ లో ఔటవ్వడం విశేషం. క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన తొలి టీ20 మ్యాచ్ కేవలం రెండు బంతులకే డకౌట్ కాగా.. సోమవారం (మార్చి 18) డునెడిన్‌లో జరిగిన రెండో టీ20 లో మూడు బంతులకే పరుగులేమీ చేయకుండా పెవిలియన్ దారి పట్టాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే 15 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్ లో 136 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ 13.1 ఓవర్లలో ఛేజ్ చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. సల్మాన్ ఆఘా 46 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. షాదాబ్ ఖాన్ (26), షహీన్ అఫ్రిది (22) రాణించారు. లక్ష్య ఛేదనలో సీఫెర్ట్ (45), ఫిన్ అలెన్ (38) చెలరేగడంతో 13.1 ఓవర్లలో 137 పరుగులు చేసి గెలిచింది. ఈ విజయంతో 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో న్యూజిలాండ్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 శుక్రవారం (మార్చి 21) జరుగుతుంది.

# ఢిల్లీ క్యాపిటల్స్‌కు కొత్త సమస్య.. ఐపీఎల్‌లో కూడా రాహుల్‌కు అన్యాయం చేస్తారా!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో ఈ సారి ఢిల్లీ క్యాపిటల్స్ మరింత పటిష్టంగా కనిపిస్తుంది. రాహుల్, మిచెల్ స్టార్క్ లాంటి ఆటగాళ్లు జట్టులో చేరడంతో జట్టులో స్టార్ ఆటగాళ్ల సంఖ్య పెరిగింది. మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్న ఐపీఎల్ సీజన్ లో ఢిల్లీ క్యాపిటల్స్ లో కూడా ఫేవరేట్ జట్లలో ఒకటి. టీమిండియా ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ కెప్టెన్ గా జట్టును నడిపించనున్నాడు. 2025 సీజన్ ప్రారంభ మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ తమ తొలి మ్యాచ్ ను సోమవారం (మార్చి 24) లక్నో సూపర్ జయింట్స్ తో తలపడుతుంది. తొలి మ్యాచ్ కు ముందు ఒక విషయంలో ఢిల్లీ ఎటూ తేల్చుకోలేకపోతుంది. అదేంటో ఇప్పుడు చూద్దాం.

ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ కు ముగ్గురు స్టార్ ఓపెనర్లు ఉన్నారు. ఆస్ట్రేలియా యువ ఓపెనర్ జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్‌తో పాటు అనుభవజ్ఞులు డుప్లెసిస్, కేఎల్ రాహుల్ స్క్వాడ్ లో ఉన్నారు. ముగ్గురు కూడా తుది జట్టులో ఉండడానికి అర్హులు. గత సీజన్ లో మెక్‌గుర్క్ తన మెరుపు ఇన్నింగ్స్ లతో ఢిల్లీకి ఆశాకిరణంలా మారాడు. రాహుల్, డుప్లెసిస్ వేరే ఫ్రాంచైజీలు తరపున ఓపెనర్లుగా అద్భుతంగా రాణించిన చరిత్ర ఉంది. దీంతో ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్లు ఎవరనే ప్రశ్నకు ఖచ్చితమైన సమాధానం దొరకడం లేదు. మెక్‌గుర్క్, డుప్లెసిస్ ఇప్పటివరకు ఐపీఎల్ లో ఓపెనర్లుగానే బ్యాటింగ్ చేశారు. మరోవైపు రాహుల్ మాత్రం మూడు, నాలుగో స్థానాల్లో బ్యాటింగ్ చేసిన రికార్డ్ ఉంది. ఢిల్లీ జట్టు రాహుల్ ను తమ వైస్ కెప్టెన్ గా ప్రకటించిన తర్వాత అతను తుది జట్టులో ఉండడం ఖాయమైంది. అదే జరిగితే ఢిల్లీ క్యాపిటల్స్ కు ఈ సీజన్ లో మెక్‌గుర్క్, డుప్లెసిస్ ఓపెనర్లుగా దిగే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. రాహుల్ భారత జట్టు కోసం ఏ స్థానంలో ఆడించినా ఆడాడు. ఐపీఎల్ లో కూడా ఈ స్టార్ బ్యాటర్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేసిన ఆశ్చర్యం లేదు. పైగా రాహుల్ ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేయగల సమర్థుడు. దీంతో జట్టు కోసం మరోసారి తన ఓపెనింగ్ స్థానాన్ని త్యాగం చేయడానికి సిద్ధపడతాడేమో చూడాలి.



# కల్కి -2 షూట్ డేట్ ఫిక్స్!

కల్కి -2%-%కి రంగం సిద్దమైందా? నాగ్ అశ్విన్ రెండవ పార్ట్ ని కూడా త్వరిత గతిన పూర్తి చేసే పనిలో పడ్డారా? అంటే అలాగే అనిపిస్తుంది. తొలి భాగం షూటింగ్ చేస్తోన్న సమయంలో రెండవ భాగానికి సంబంధించి 30 శాతం షూటింగ్ పూర్తయిందని ప్రకటించారు. అయితే తాజాగా మిగిలిన 70 శాతం షూటింగ్ కి సంబంధించి నాగీ ప్రణాళిక సిద్దం చేసారు. మే నెల నుంచి చిత్రీకరణ ప్రారంభమవుతుందని సమాచారం.తొలి షెడ్యూల్ అమితాబచ్చన్ పాల్గొంటారు. అటుపై జూన్ లో రెండవ షెడ్యూల్ మొదలవుతుందిట. ఇందులో చాలా మేజర్ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తారుట. ఇందులోనే ప్రభాస్-కమల్ హాసన్ పై కీలక పోరాట ఘట్టాలు చిత్రీకరించనున్నారుట. రెండవ భాగంలో ప్రభాస్ పాత్ర కీలకంగా ఉంటుందని సమా చారం. తొలి భాగంలో ఎక్కువగా అమితాబచ్చన్ పాత్ర హైలైట్ అయిన సంగతి తెలిసిందే.సినిమాలో ప్రభాస్ ఉన్నా? హీరో ఎవరు? అంటే అమితాబ్ గానే భావించారంతా. అంత బలమైన పాత్ర అమితాబ్ పోషించారు. ఈ నేపథ్యంలో రెండవ భాగంలోనూ అమితాబ్ పాత్ర ఎక్కడా తగ్గదని తెలుస్తోంది. సినిమాలో చాలా సన్నివేశాలు ఎంతో యూనిక్ గా ఉండబోతున్నాయట. ఇంత వరకూ ఇండియాన్ స్క్రీన్ పై చూడని ఎన్నో సన్నివేశాలుంటాయం టున్నారు. అలాగే కథ ఎమోషనల్ గానూ కనెక్ట్ అవుతుందిట.ఈ సినిమా ఎలా ఉంటుందన్నది నాగీ ఇప్పటికే హింట్ ఇచ్చారు. సినిమా రిలీజ్ ఆలస్యమైనా ఓ రెండు సినిమాల ప్రభావం ఈ ఒక్క సినిమా కథలోనే ఉంటుందన్నారు. ప్రభాస్ పాత్ర రెండవ భాగంలో అభి మానుల ఊహని మించి ఉంటుందని వెల్లడించారు.



## క్లాసిక్ చీరలో ఆషికా రంగనాథ్ స్టన్ చేసింది



## రితికా సింగ్ ఆకర్షణీయమైన ఫోటో కలెక్షన్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com